## దక్షిణాఫ్రికాలో కామారెడ్డి వాసి అనుమానాస్పద మృతి




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## పరకాలలో టపాసుల వ్యాపారులకు భారీ నష్టం




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 298 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 22 అక్టోబర్ 2025


# మార్చి నాటికి మావోయిజం అంతం

- మావోయిజంపై పోరులో భద్రతా దళాలది కీలక పాత్ర అన్న రాజ్‌నాథ్
- ఒకప్పటి రెడ్ కారిడార్లు ఇప్పుడు గ్రోత్ కారిడార్లుగా మారాయని వ్యాఖ్య
- ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి వస్తున్న నక్సలైట్లు
- పోలీసు సంస్మరణ దినోత్సవంలో అమరవీరులకు నివాళులు




# జపాన్ చరిత్రలో కొత్త శకం..

## తొలి మహిళా ప్రధానిగా సనా తకాయిచి!

- పార్లమెంట్ దిగువ సభలో సునాయాసంగా నెగ్గిన తకాయిచి
- సంకీర్ణం నుంచి వైదొలగిన కొమెయిటో పార్టీ
- జపాన్ ఇన్నోవేషన్ పార్టీతో ఎల్‌డీపీ కొత్త పొత్తు






# తెలంగాణ పోలీసులు దేశంలోనే అగ్రస్థానం



## పోలీసు అమరవీరుల దినోత్సవంలో రేవంత్ రెడ్డి

- విధి నిర్వహణలో పోలీసుల త్యాగాలు మరువలేనివని కొనియాడిన సీఎం
- అమరవీరుల కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా

**హైదరాబాద్,21 (పిసిడబ్ల్యూ న్యూస్):** మిగిలిన మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలో కలిసి, తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవలి కాలంలో పలువురు మావోయిస్టులు లొంగిపోతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

మిగతా 2లో...





# ఏపీ వ్యవసాయానికి ఆస్ట్రేలియా అండ..


- ఆస్ట్రేలియాలోని వెస్టన్ సిడ్నీ యూనివర్సిటీని సందర్శించిన మంత్రి నారా లోకేశ్
- ఏపీ వ్యవసాయ ఆధునికీకరణకు సహకరించాలని వర్సిటీ యాజమాన్యానికి విజ్ఞప్తి
- వాతావరణాన్ని తట్టుకునే పంటలు, ఫార్మింగ్‌పై కలిసి పనిచేయాలని ప్రతిపాదన
- ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీతో భాగస్వామ్యం కావాలని సూచన

**సిడ్నీ,అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టి, రైతులను బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రఖ్యాత వెస్టన్ సిడ్నీ యూనివర్సిటీని (డబ్ల్యూఎస్‌యూ) సందర్శించి, వర్సిటీ సీనియర్ ప్రతినిధులు, వ్యవసాయ టెక్నాలజీ పరిశోధకులతో మిగతా 2లో...

## ముగిసిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్ గడువు..

### 150కి పైగా నామినేషన్లు

- మధ్యాహ్నం 3 గంటల వరకు ముగిసిన నామినేషన్ గడువు
- గేటు లోపల ఉన్న వారికి నామినేషన్ వేయడానికి అవకాశం
- బరిలో ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు,
- రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులు




## జూబ్లీహిల్స్ కోసం బిఆర్ఎస్ స్టార్ కాంపెయినర్లు

- 40మంది పేర్లు విడుదల చేసిన పార్టీ
- జాబితాలో మాజీ సిఎం కెసిఆర్ పేరు



**హైదరాబాద్,అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రచారం కోసం భారత రాష్ట్ర సమితి బిఆర్ఎస్ పార్టీ తరపున మొత్తం 40 మంది స్టార్ క్యాంపెయినర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆమోదం తెలిపింది. ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ సోమ భరత్ కుమార్ ఇచ్చిన ప్రతిపాదన మేరకు.. వారికి వాహనాల అనుమతికి పాస్‌లను మంజూరు చేశారు. మిగతా 2లో...

# ప్రభుత్వ వైద్యానికి సుస్తీ

## ఖైరతాబాద్ బస్తీ దవాఖానలను పరిశీలించిన కెటిఆర్

- మా ఎమ్మెల్యే మీ స్టార్ క్యాంపెయినరా?
- గెలిచిన వారు ఏ పార్టీలో ఉన్నారో ?
- దానం నాగేందర్ స్టార్ కాంపెయినర్ ఎలా
- ప్రభుత్వ వైద్యానికి సుస్తీ పట్టిందని విమర్శ

**హైదరాబాద్,అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేక పోతున్నారని.. వాళ్ళకి సిగ్గనిపించడం లేదా అని ప్రశ్నించారు. స్పీకర్ దగ్గర తాము పార్టీ మారలేదని అబద్దాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. దానం నాగేందర్ పేరు కాంగ్రెస్ పార్టీ క్యాంపెయినర్ల లిస్టులో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. దానం నాగేందర్ ఏ పార్టీలో గెలిచారు, ఏ పార్టీకి ప్రచారం చేస్తున్నాడని నిలదీశారు. ఏఐసీసీ అంటే.. ఆల్ ఇండియా కరప్షన్ కమిటీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీలో



గెలిచిన వాళ్లను తీసుకుని, వాళ్ల పార్టీ క్యాంపెయినర్ల జాబితాలో పెట్టారని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ హైదరాబాద్‌ను గాలికొదిలేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బస్తీ దవాఖానలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మిగతా 2లో...

## సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఏపీ నేత రామకృష్ణ

- చండీగఢ్ జాతీయ మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నిక
- ఇంతకాలం ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగిన రామకృష్ణ
- ఏపీ సీపీఐకి నూతన కార్యదర్శిగా ఈశ్వరయ్య ఏకగ్రీవం




**అమరావతి, అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటిదాకా సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన కె. రామకృష్ణ ఇప్పుడు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా 2లో...

# పెట్టుబడుల వేట

## 3 రోజుల్లో 25 సమావేశాలు... యూఏఈలో సీఎం చంద్రబాబు పర్యటన

- విశాఖ భాగస్వామ్య సదస్సు కోసం పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం
- పారిశ్రామికవేత్తలతో రోడ్‌షో, వరుసగా కీలక భేటీలు
- తెలుగు ప్రవాసులతోనూ ప్రత్యేకంగా సమావేశం

**అమరావతి,అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే ఏకైక లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో కీలక విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు.నేటి నుంచి మూడు రోజుల పాటు ఆయన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆయన అత్యంత బిజీగా గడపనున్నారు. మిగతా 2లో...



## రియాజ్ ఎన్‌కౌంటర్‌ను సుమోటోగా స్వీకరించిన మానవ హక్కుల కమిషన్.

- నివేదికను సమర్పించాలని డీజీపీకి కీలక ఆదేశాలు
- నవంబర్ 24వ తేదీ లోగా నివేదిక అందించాలని డీజీపీకీ ఆదేశం
- ఆత్మరక్షణ కోసం జరిపిన కాల్పుల్లో రియాజ్ చనిపోయినట్లు ప్రకటించిన డీజీపీ



**హైదరాబాద్,అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** నిజామాబాద్ కానిస్టేబుల్ హత్య కేసులో నిందితుడు రియాజ్ ఎన్‌కౌంటర్‌ను తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా స్వీకరించింది. ఈ ఎన్‌కౌంటర్‌కు సంబంధించి నివేదికను సమర్పించాలని డీజీపీకీ ఆదేశాలు జారీ చేసింది. మిగతా 2లో...

# జపాన్ చరిత్రలో కొత్త శకం..

## తొలి మహిళా ప్రధానిగా సనా తకాయిచి!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** జపాన్ రాజకీయ చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలైంది. దేశ మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా కన్జర్వేటివ్ నేత సనా తకాయిచి (64) ఎన్నికై చరిత్ర సృష్టించారు. మంగళవారం పార్లమెంట్ దిగువ సభలో జరిగిన ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు. గత నెలలో ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహిస్తూ షిగెరు ఇషిబా రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. పార్లమెంటులోని 465 స్థానాలున్న దిగువ సభలో జరిగిన ఓటింగ్‌లో సనా తకాయిచికి 237 ఓట్లు లభించాయి. దీంతో ఆమె మెజారిటీ మార్కును సునాయాసంగా దాటారు. ఎగువ సభ ఆమోదం కూడా పొందిన తర్వాత, ఈ సాయంత్రం ఆమె జపాన్ 104వ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. చక్రవర్తిని కలిసిన అనంతరం ఆమె అధికారికంగా బాధ్యతలు చేపడతారు.

చైనా విధానాలపై తీవ్ర విమర్శలు చేసే వ్యక్తిగా గుర్తింపు పొందిన తకాయిచి, గతంలో హెవీ మెటల్ డ్రమ్మర్‌గా కూడా పనిచేశారు. అక్టోబర్ 4న అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) అధ్యక్షురాలిగా ఆమె ఎన్నికయ్యారు. అయితే, ఆమె కన్జర్వేటివ్ భావాలు, పార్టీలోని నిధుల కుంభకోణం కారణంగా పాత మిత్రపక్షమైన కొమెయిటో పార్టీ సంకీర్ణం నుంచి వైదొలిగింది. ఈ పరిణామంతో ఎల్‌డీపీ.. సంస్కరణవాద, మితవాద పార్టీ అయిన జపాన్ ఇన్నోవేషన్ పార్టీ (జేఐపీ)తో సోమవారం సాయంత్రం కొత్త పొత్తు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా తకాయిచి మాట్లాడుతూ "జపాన్ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తానని, భావి తరాలకు బాధ్యత వహించే దేశంగా జపాన్‌ను తీర్చిదిద్దుతా" అని హామీ ఇచ్చారు. ఆమె సొంత పట్టణమైన నారాలో ఒక విశ్రాంత ఉద్యోగి మాట్లాడుతూ "ఆమె మహిళ అయినా చాలా గట్టి మనస్తత్వం ఉన్న వ్యక్తి. ఏది ఒప్పో, ఏది తప్పో స్పష్టంగా చెప్పగలరు" అని తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

### మోదీ శుభాకాంక్షలు

#### బంధాన్ని మరింత బలోపేతం చేద్దామని పిలుపు

జపాన్ దేశ చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలైంది. దేశానికి తొలి మహిళా ప్రధానమంత్రిగా సనే తకాయిచి ఎన్నికై చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రక ఘట్టంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సనే తకాయిచితో కలిసి పనిచేసేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీ మంగళవారం తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక ప్రత్యేక పోస్ట్ చేశారు. భారత్, జపాన్ మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో, అలాగే ప్రపంచవ్యాప్తంగా శాంతి, సుస్థిరత, శ్రేయస్సును నెలకొల్పడంలో ఇరు దేశాల బంధం అత్యంత కీలకమని ఆయన తన పోస్టులో అభిప్రాయపడ్డారు.

# తెలంగాణ పోలీసులు దేశంలోనే అగ్రస్థానం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో నేడు నిర్వహించిన 'పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవం'లో ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, ముందుగా పోలీసు అమరవీరుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరించి, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బందికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజానికి పోలీసులు ఒక నమ్మకాన్ని, భరోసాను ఇస్తారని కొనియాడారు. ప్రజల శాంతిభద్రతల కోసం పోలీసులు తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం పోలీసుల సంక్షేమానికి కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక 16 వేల కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలను భర్తీ చేశామని గుర్తుచేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు విద్య, ఆర్థిక విషయాల్లో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దేశంలోనే అత్యధిక పరిహారం అందిస్తున్నామని ఆయన తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సైబర్, డ్రగ్స్ వంటి కొత్త తరహా నేరాలు పుట్టుకొస్తున్నాయని, వాటిని ఎదుర్కోవడంలో తెలంగాణ పోలీసులు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారని సీఎం ప్రశంసించారు. డ్రగ్స్‌పై పోరాటానికి 'ఈగల్ టీమ్'ను, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. రాజకీయ ఒత్తిళ్లు లేకుండా పోలీసులు స్వేచ్ఛగా పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# మార్చి నాటికి మావోయిజం అంతం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలో మావోయిజంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిజాన్ని దేశం నుంచి పూర్తిగా నిర్మూలిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భద్రతా బలగాల సమష్టి కృషితో గత కొన్నేళ్లుగా మంచి ఫలితాలు వస్తున్నాయని రాజ్‌నాథ్ తెలిపారు. ఈ ఏడాది కూడా పలువురు అగ్రశ్రేణి నక్సలైట్లను మట్టుబెట్టినట్లు వెల్లడించారు. మావోయిజం ప్రభావిత జిల్లాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిందని, మిగిలిన కొన్ని ప్రాంతాలను కూడా వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిస్థాయిలో మావోయిస్టు రహితంగా మారుస్తామని ఆయన స్పష్టం చేశారు. "ఈ సమస్య జాడలు కూడా లేకుండా పోతాయని దేశం మొత్తం నమ్మకంతో ఉంది" అని ఆయన అన్నారు. ఒకప్పుడు ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో మావోయిజం పెను సమస్యగా ఉండేదని గుర్తుచేశారు. కానీ, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, ఒకప్పుడు నక్సలైట్ల హింసతో వణికిపోయిన ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందని వివరించారు. "గతంలో రెడ్ కారిడార్లుగా పేరుపొందిన ప్రాంతాలు ఇప్పుడు గ్రోత్ కారిడార్లుగా రూపాంతరం చెందుతున్నాయి" అని ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, రహదారులు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారక చిహ్నం వద్ద జరిగిన పోలీసు సంస్మరణ దినోత్సవంలో రాజ్‌నాథ్ పాల్గొన్నారు. 1959లో లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద చైనా సైనికుల దాడిలో ప్రాణాలు అర్పించిన 10 మంది పోలీసుల త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మావోయిజాన్ని అంతం చేయడంలో పోలీస్, సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, స్థానిక యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తున్న తీరు ప్రశంసనీయమని కొనియాడారు. వారి అవిశ్రాంత కృషి వల్లే ఈ సమస్య చరిత్రగా మిగిలిపోతోందని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో పోలీసు బలగాల ఆధునికీకరణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాజ్‌నాథ్ తెలిపారు. వారికి అత్యాధునిక ఆయుధాలు, డ్రోన్లు, నిఘా వ్యవస్థలు, ఫోరెన్సిక్ ల్యాబ్‌ల వంటి సాంకేతికతను అందిస్తున్నామని చెప్పారు. బలమైన పోలీసు వ్యవస్థతోనే బలమైన దేశ నిర్మాణం సాధ్యమని ఆయన పేర్కొన్నారు.

# పెట్టుబడుల వేట

(మొదటి పేజీ తరువాయి)

కేవలం మూడు రోజుల్లోనే ఏకంగా 25 సమావేశాల్లో పాల్గొంటూ, రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకురావడమే ప్రధాన అజెండాగా ముందుకు సాగనున్నారు. విశాఖపట్నంలో నవంబర్ 14, 15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సు (పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్) విజయవంతమే ధ్యేయంగా ఈ పర్యటన సాగనుంది.

**పర్యటన షెడ్యూల్ ఇలా...**

ముఖ్యమంత్రి చంద్రబాబు అక్టోబర్ 22న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి దుబాయ్‌కు బయల్దేరి, భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకు అక్కడికి చేరుకుంటారు. దుబాయ్‌లో అడుగుపెట్టిన వెంటనే ఆయన తన అధికారిక కార్యక్రమాలను ప్రారంభిస్తారు.

మూడు రోజుల పర్యటనలో ప్రభుత్వ ప్రతినిధులతో 3 సమావేశాలు, పారిశ్రామికవేత్తలతో 14 వన్-టు-వన్ భేటీలు, రౌండ్ టేబుల్ సమావేశాలు ఉంటాయి. వీటితో పాటు 2 సైట్ విజిట్స్, 2 మీడియా ఇంటర్వ్యూలు, సీఐఐ ఆధ్వర్యంలో ఒక రోడ్‌షో, తెలుగు ప్రవాసులతో మరో సమావేశం సహా మొత్తం 25 కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ప్రతిరోజూ దాదాపు ఐదారు సమావేశాలు ఉండేలా పర్యటనను పకడ్బందీగా రూపొందించారు. పర్యటనలో భాగంగా తొలిరోజైన 22న చంద్రబాబు ఐదు ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. శోభా గ్రూప్, షరాఫ్ డీజీ, ట్రాన్స్ వరల్డ్ గ్రూప్, లూథా గ్రూప్, దుబాయ్ ఫ్యూచర్ ఫౌండేషన్ వంటి సంస్థల అధినేతలతో ఆయన వన్-టు-వన్ భేటీలు నిర్వహిస్తారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా ఇండస్ట్రియల్ పార్కులు, ఐటీ, లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్, పోర్టులు, షిప్ మేనేజ్‌మెంట్ వంటి కీలక రంగాల్లో రాష్ట్రంలో ఉన్న పెట్టుబడుల అవకాశాలపై చర్చిస్తారు. అనంతరం, ఆయన 'మ్యూజియం ఆఫ్ ది ఫ్యూచర్'ను సందర్శిస్తారు. అక్కడ 'జర్నీ టు 2071' థీమ్‌తో ఏర్పాటు చేసిన స్పేస్ ట్రావెల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను, భవిష్యత్ టెక్నాలజీ సొల్యూషన్స్‌ను పరిశీలిస్తారు. అదే రోజు రాత్రి జరిగే రోడ్‌షోలో పాల్గొని పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించి, విశాఖ సదస్సుకు ఆహ్వానిస్తారు. గతంలో సింగపూర్‌లో విజయవంతంగా పర్యటించిన ముఖ్యమంత్రి బృందం, ఇప్పుడు యూఏఈలోని పారిశ్రామికవేత్తలను, ప్రభుత్వ ప్రతినిధులను విశాఖ సదస్సుకు ఆహ్వానించనుంది. తన పర్యటన చివరి రోజున, దుబాయ్‌లో ఏపీఎన్ఆర్‌టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే తెలుగు డయాస్పోరా సమావేశంలో చంద్రబాబు పాల్గొని ప్రసంగిస్తారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసుల భాగస్వామ్యంపై ఆయన చర్చించనున్నారు.

# రియాజ్ ఎన్‌కౌంటర్‌ను సుమోటోగా స్వీకరించిన మానవ హక్కుల కమిషన్

(మొదటి పేజీ తరువాయి)

నిజామాబాద్‌లో జరిగిన సంఘటన గురించి వార్తాపత్రికల్లో వచ్చిన కథనాలను మానవ హక్కుల కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. నిందితుడు రియాజ్ సాయుధ రిజర్వ్ కానిస్టేబుల్ సర్వీస్ ఆయుధాన్ని లాక్కుని పారిపోవడానికి ప్రయత్నించాడని, ఆ తర్వాత పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపారని, ఫలితంగా అతను మరణించాడని పోలీసులు చెబుతున్నారు. ఆత్మరక్షణ కోసం జరిగిన కాల్పుల్లో నిందితుడు రియాజ్ మృతి చెందినట్లు డీజీపీ కూడా ప్రకటించారు. రియాజ్ ఎన్‌కౌంటర్ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద జీవించే హక్కుకు సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలను లేవనెత్తుతుందని ఈ సందర్భంగా మానవ హక్కుల కమిషన్ పేర్కొంది. నవంబర్ 24వ తేదీ లోగా ఈ సంఘటనకు దారి తీసిన పరిస్థితులను, కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం నివేదికను అందజేయాలని డీజీపీని ఆదేశించింది.

అక్టోబర్ 17న నిజామాబాద్ సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను రౌడీషీటర్ రియాజ్ పొడిచి చంపాడు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న రియాజ్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళుతుండగా రియాజ్ కత్తితో దాడి చేశాడు. కానిస్టేబుల్ ప్రమోద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ క్రమంలో రియాజ్‌ను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. గాయపడిన రియాజ్‌ను పోలీసులు నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఓ కానిస్టేబుల్ నుంచి గన్ లాక్కుని పారిపోయే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పోలీసులు ఆత్మరక్షణ కోసం జరిపిన కాల్పుల్లో రియాజ్ మరణించాడు.

# సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఏపీ నేత రామకృష్ణ

## ఏపీ సీపీఐకి నూతన కార్యదర్శిగా ఈశ్వరయ్య ఏకగ్రీవం



(మొదటి పేజీ తరువాయి)

చండీగఢ్‌లో జరిగిన పార్టీ జాతీయ మహాసభల్లో ఈ నియామకం జరిగింది. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా ఆయనకు లభించిన గుర్తింపు ఈ పదవికి దోహదపడింది. రామకృష్ణ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లడంతో, ఏపీ సీపీఐ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. అటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి పదవిని కూడా పార్టీ భర్తీ చేసింది. ఏపీ సీపీఐ కార్యదర్శిగా జి. ఈశ్వరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వాస్తవానికి ఆగస్టులో ఒంగోలులో జరిగిన రాష్ట్ర మహాసభల్లోనే నూతన కార్యదర్శి ఎన్నిక పూర్తి కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. జాతీయ మహాసభల తర్వాతే ఈ నియామకం ఉంటుందని అప్పట్లో పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. దాని ప్రకారమే తాజా ఎన్నిక జరిగింది. ఇప్పటిదాకా రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించిన కె. రామకృష్ణ మూడు పర్యాయాలు ఈ పదవిని చేపట్టడంతో, పార్టీ నిబంధనల ప్రకారం ఆయన కొనసాగేందుకు వీల్లేదు. దాంతో, ఆయన స్థానంలో ఈశ్వరయ్యను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

# ఏపీ వ్యవసాయానికి ఆస్ట్రేలియా అండ..



(మొదటి పేజీ తరువాయి)

కీలక సమావేశం నిర్వహించారు. ఏపీ వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు తమతో కలిసి పనిచేయాలని లోకేశ్ వారికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేయాలి. వాతావరణ మార్పులను తట్టుకునే పంటల అభివృద్ధి, ప్రెసిషన్ ఫార్మింగ్ వంటి రంగాల్లో మీ నైపుణ్యాన్ని మా రైతులకు అందించాలి" అని కోరారు. స్మార్ట్ ఫార్మింగ్, అగ్రి-టెక్ ఆవిష్కరణలపై రైతులకు, వ్యవసాయ నిపుణులకు శిక్షణ ఇచ్చేందుకు సంయుక్త కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. స్మార్ట్ నీటిపారుదల వ్యవస్థలు, కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత వ్యవసాయ పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటులో సహకరించాలని కోరారు. రాష్ట్రంలో స్థిరమైన వ్యవసాయ విధానాల రూపకల్పనకు పరిశోధన ఆధారిత సూచనలు ఇవ్వాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేశ్ ప్రతిపాదనలపై వర్సిటీ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. తమ విశ్వవిద్యాలయం స్థిరమైన అభివృద్ధిలో ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని ప్రపంచంలోని టాప్ 2 శాతం విశ్వవిద్యాలయాలలో ఒకటిగా గుర్తింపు పొందిందని వారు వివరించారు. ఇప్పటికే ఐఐటీల వంటి భారతీయ సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. తమ అనుబంధ సంస్థ హాక్స్‌బరీ ఇన్ స్టిట్యూట్ ఫర్ ద ఎన్విరాన్‌మెంట్... భూసారం, నీటి యాజమాన్యం వంటి అంశాలపై విస్తృత పరిశోధనలు చేస్తోందన్నారు. ఏఐ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీలను ఉపయోగించి పంట దిగుబడులను పెంచడంపై దృష్టి సారించామని, ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు.

# ప్రభుత్వ వైద్యానికి సుస్తీ

(మొదటి పేజీ తరువాయి) హైదరాబాద్‌ను రేవంత్ గాలికి వదిలేశారని చెప్పారు. ప్రజల ఆరోగ్యం మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి ఖైరతాబాద్ లోని ఇబ్రహీంనగర్ బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాని సందర్శించారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానలో సదుపాయాలను పరిశీలించారు. మందులు, పరికరాల పని తీరు, దవాఖానలో అందుతున్న వైద్య సేవల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ నలువైపులా నాలుగు టిమ్స్ దవాఖానలను ప్రారంభించిందని చెప్పారు. 90 శాతం పనులు బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 10 శాతం పనులు చేయడానికి ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని మండిపడ్డారు. బస్తీ దవాఖానలను రేవంత్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా తమకు 4 నెలలుగా జీతాలు రావడం లేదని, జీతాల విషయంలో ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందని మహిళా డాక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలపై ఆరా తీశారు. చిన్నారులకు చా÷-లకెట్లు పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నాడు కేసీఆర్ హయాంలో ప్రజలకు, ముఖ్యంగా పేదలు అందరికీ అందుబాటులో ఉండేలా 450 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారని తెలిపారు. వాటితో పాటు తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంటర్‌లను ఏర్పాటు చేసి, ప్రజలకు ఉచితంగా పరీక్షలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బస్తీ దవాఖానాలను నిర్లక్ష్యం చేసి, ప్రజారోగ్యాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారని విమర్శించారు. నాలుగు ఐదు నెలలుగా బస్తీ దవాఖానాలో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని చెప్పారు. బస్తీ దవాఖానల్లో మందు గోలీలు కూడా అందుబాటులో లేవన్నారు. ప్రజారోగ్యం అంటే రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ ఉన్నదో దీనితో అర్థమవుతుందన్నారు.

# దక్షిణాఫ్రికాలో కామారెడ్డి వాసి అనుమానాస్పద మృతి



**కామారెడ్డి, అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** దీపావళి రోజు దక్షిణాఫ్రికాలో తెలంగాణ వాసి మృతిచెందాడు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌కు చెందిన బత్తుల శ్రీనివాస్ (32) అనుమానాస్పదస్థితిలో మరణించాడు. వివరాల్లోకి వెళ్తే.. భిక్కనూర్‌కు చెందిన బత్తుల శ్రీనివాస్ కొన్నేళ్ల క్రితం ఉపాధి కోసం దక్షిణాఫ్రికాకు వలస వెళ్లాడు. అక్కడ బోరింగ్ డ్రిల్లర్, డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే సోమవారం నాడు చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో తెలంగాణలోని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. తమ కొడుకు మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా, మృతునికి భార్య నవిత, కూతురు లాస్య, కొడుకు నిహాల్ ఉన్నారు.

# జూబ్లీహిల్స్ కోసం బిఆర్ఎస్ స్టార్ కాంపెయినర్లు

(మొదటి పేజీ తరువాయి)


ఈ ఎన్నికల ప్రచారం అక్టోబర్ 18 నుంచి నవంబర్ 9 సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనున్నది. బీఆర్ఎస్ స్టార్ క్యాంపెయిన్ల జాబితాలో ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ఈ జాబితాలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు పేరు సైతం ఉన్నది. అలాగే, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, టీ శ్రీనివాస్ యాదవ్, వీ ప్రశాంత్ రెడ్డి, జీ జగదీశ్ రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, ఎస్ నిరంజన్ రెడ్డి ఉన్నారు. మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావు, వీ శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్ సైతం స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఉన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్లు టీ పద్మారావు గౌడ్, పద్మా దేవేందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు ఎం కృష్ణ రావు, కేపీ వివేకానంద గౌడ్, డీ సుధీర్ రెడ్డి, డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, కాలేరు వెంకటేశం, పాడి కౌశిక్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, అనిల్ జాదవ్, బండారు లక్ష్మా రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, చింతా ప్రభాకర్ సైతం స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్నారు. ఎమ్మెల్సీల్లో దాసోజు శ్రవణ్, ముఠా గోపాల్, శంబీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, టాటా మధుసూధన్, ఎల్ రమణా, తక్కెలపల్లి రవీందర్ రావు ఉన్నారు. ఎంపీ వద్దిరాజు రవి చంద్ర, మాజీ ఎమ్మెల్యేలు విష్ణు వర్ధన్ రెడ్డి, షకీల్ అమీర్ మొహమ్మద్, మాజీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, షేక్ అబ్దుల్లా సోహైల్ పేర్లు సైతం ఉన్నాయి.



## ముగిసిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్ గడువు.. 150కి పైగా నామినేషన్లు

**హైదరాబాద్, అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికకు నామినేషన్ల గడువు నేటితో ముగిసింది. ఈ నియోజకవర్గం నుంచి మొత్తం 150కి పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ దాఖలు చేయడానికి ఈరోజు మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉండగా, ఆ సమయానికి గేటు లోపల ఉన్నవారికి నామినేషన్ దాఖలు చేయడానికి అవకాశం కల్పించారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు, రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులు, ఓయూ, నిరుద్యోగ సంఘాల నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు. రేపటి నుంచి నామినేషన్లను పరిశీలించనున్నారు. అక్టోబర్ 24 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా, 14న ఫలితాలు వెల్లడికానున్నాయి.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**• జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్**



**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్21(పి.సి.డబ్ల్యూ న్యూస్):** ప్రజల ధన, మాన ప్రాణ రక్షణలో అహర్నిశలు కృషి చేస్తూ.. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి పోలీస్ ఫ్లాగ్ డే ను పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయం లో స్మృతి పరేడ్ నిర్వహించి, అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించిన జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 21 అక్టోబర్ 1959 వ సంవత్సరం లో సి.ఆర్.పి.యఫ్ - ఎస్.ఐ కరమ్ సింగ్ నాయకత్వంలోని 20 మంది భారత జవాన్లు లడక్ ప్రాంతంలో హాట్ స్ప్రింగ్ వద్ద విధులు నిర్వహిస్తుండగా చైనా ఆర్మీ మన ఆర్మీ పై దొంగ దాడి చేసి 10 మందిని జవాన్ లను హతమార్చిందని, ఆ రోజు నుండి దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులను స్మరిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా (పోలీస్ ఫ్లాగ్ డే) గా నిర్వహిస్తున్నం అన్నారు. ఒక్కొక రాష్ట్రంలో ఒక్కొక్క రకమైన సమస్యలు ఉండేవి మన రాష్ట్రంలో గతంలో నక్సలిజం ప్రభావం ఎక్కువగా ఉండేదని, ఆ సమయంలో ఎంతో మంది జవాన్లను కోల్పోవడం జరిగిందని, పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛతీస్ ఘడ్ మరియు అస్సాం వంటి కొన్ని నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాలలోనూ అనేక మంది జవాన్లను కోల్పోవడం జరిగిందన్నారు. జమ్ముకాశ్మీర్ లాంటి రాష్ట్రాలలో పాక్ ప్రేరిపిత ఉగ్రవాదులతో ఎంతో మంది పోలీసులు, ఆర్మీ జవాన్లు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఉగ్ర మూకలను హతమార్చి, తమ తనువులను చాలించారని, ఆనాటి వారి ప్రాణత్యాగల వలననే మనం ఈ రోజు స్వేచ్ఛగా ఉండగలుగుతున్నాం అన్నారు. ఈ సంవత్సరంలో మన దేశంలో విధినిర్వహణలో 191-మంది జవాన్లు వీరమరణం పొందారని, ఇందులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు 5- మంది ఉన్నారు. వీరమరణం పొందిన వారి ప్రాణత్యాగాలను స్మరిస్తూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని తెలిపారు. పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని, ఆనాటి వారి ప్రాణత్యాగల వలననే నేడు మనందరం సుఖః సంతోషాలతో ఉండగలుగుతున్నాం అన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితిలలోనైనా పోలీసు శాఖ ఎదురు నిలబడి, పోరాడటం జరుగుతుందని, అలాంటి పోలీసుల సేవలు మనందరి మదిలో చిరస్మరణీయం అన్నారు. గత జూన్ నెలలో జరిగిన సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో ఎంతోమంది పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా శిధిలాల క్రింద చిక్కుకు పోయిన మృతదేహాలను వెలికి తీసి, తమ ధైర్య సహసాలను చాటుకున్నారు అన్నారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్నిరకాల సహాయ సహకారాలు అందించడం జరుగుతుంది అన్నారు. పోలీస్ అమరుల కుటుంబాలను ఉధ్యేశించి మాట్లాడుతూ.. వారి కుటుంబాల సంక్షేమం, వారికి ఆర్థిక పరమైన ప్రయోజనాలను చేకూరేలా, వారి కుటుంబాలలో మనోధైర్యాన్ని అందించటమే పోలీసు అమరవీరులకు అందించే నిజమైన నివాళి అన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకై ఏర్పడ్డ వ్యవస్థ పోలీస్ వ్యవస్థ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు దేశ అంతర్గత భద్రత, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, సైబర్ నేరాలు, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిర్మూలనలో జిల్లా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉంటూ ప్రజలను చైతన్య పరుస్తూ.. పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. అమరవీరులు అయిన పోలీసుల యొక్క త్యాగాలను గుర్తు చేసుకుంటూ అక్టోబర్ 21 నుండి అక్టోబర్ 31వ తేదీ వరకు ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఎస్పీ అన్నారు.డిఎస్పీలు తిరుపతి రావు, కృష్ణకిషోర్, గంద్రతి మోహన్, ఏ.ఆర్ డిఎస్పీలు శ్రీనివాస్, విజయప్రతాప్, సీఐలు, ఆర్.ఐలు ఎస్.ఐ అధికారులు సిబ్బంది పాల్గొని నివాళులు అర్పించడం జరిగింది.



# మినీ ట్యాంక్ బండ్ రోడ్డు ఎదురుగా డివైడర్ను ఢీకొన్న గ్రానైట్ లారీ

**- లారీలోంచి దూకి ప్రాణాలు కాపాడుకున్న డ్రైవరు,క్లీనరు**

**- భారీ గ్రానైట్ రాళ్లతో లారీలో తీసుక వెళ్లేందుకు అనుమతి ఉన్నదా అంటున్న స్థానికులు?**

**- క్రేన్ సహాయంతో లారీనీ తొలగించిన పోలీసులు**



**తొర్రూరు ప్రతినిధి, అక్టోబర్ 21(పిసీడబ్ల్యూ న్యూస్):** వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిలో గల తోరూర్ పట్టణంలోని మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో అతిపెద్ద గ్రానైట్ బండరాలతో తీసుకు వెళ్తున్న ట్రాలీ అదుపుతప్పి బస్టాండ్ కు అతి సమీపంలో గల మినీ ట్యాంక్ బండ్ రోడ్డుకు ఎదురుగా డివైడర్ పైకి దూసుకు వెళ్ళింది. తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినప్పుడు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు అయింది అని స్థానికులు అన్నారు. ప్రమాదం సమయంలో లారీ డ్రైవర్, క్లీనరు కిందికి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. ఇరువురికి గాయాలు కావటంతో 108 అంబులెన్స్ లో ఖమ్మం తరలించారు. తొర్రూరు పట్టణంలో తరచు ప్రమాదాలు జరగడానికి కారణం ఎవరు?. వాహన డ్రైవర్ల లేక స్థానిక అధికారులా ?. తొర్రూరు పట్టణంలోని పాల కేంద్రం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు వెళ్లే జాతీయ రహదారులో ఎన్ని మూల మలుపులు ఉన్నాయో ఒకసారి గమనించండి. రోడ్డులో ఏర్పాటు చేసిన డివైడర్లకు చివరి ప్రాంతంలో ఎక్కడైనా సరే ప్రమాద హెచ్చరికల బోర్డులు ఉన్నాయా ఇది ఎవరి తప్పిదం? ప్రతి డివైడర్ చివరిలో పసుపు రంగులో హెచ్చరికలు సూచించే బోర్డు ఉంటుంది ఇది కాకుండా బస్టాండ్ ప్రాంతంలో అన్నారం రోడ్డు, అరిపిరాల రోడ్డు, , కంటాయిపాలెం రోడ్డు, మూల మలుపులు తిరిగే హెచ్చరిక బోర్డు లేకపోవడంతో ఎటునుండి ఏ వాహనం వస్తుందో తెలియక జాతీయ రహదారులో వెళ్తున్న వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి?. షోకేస్ లో కనిపించే బొమ్మల ట్రాఫిక్ సిగ్నల్ మాత్రమే ఉంటాయి .అవి పని చేసేది ఎప్పుడు అని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు?. ఈ మధ్యకాలంలో ఈ జాతీయ రహదారులు గ్రానైట్ లారీలు ప్రమాదాలకు గురవుతూనే వస్తున్నాయి స్థానిక పట్టణవాసులు గ్రానైట్ లారీలను చూడగానే భయభ్రాంతులకు గురవుతూ ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో ఏ బండ రాయి కింద పడితే ఎవరి ప్రాణాలు పోతాయి తెలియని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొర్రూరు పట్టణంలో రోడ్డు వెడల్పు పేరుతో పనులు నిర్వహించి అర్ధాంతరంగా వదిలివేయడంతో రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యా పారులు, వాహనదారులు రోడ్డుపైనే నిలిపివేయడంతో సుదూర ప్రాంతం నుంచి వచ్చే భారీ వాహనాలు,ఆర్టీసీ బస్సులకు అంతరాయం కలుగుతూనే ఉంది. ఈ విషయాన్ని ఎవరు పట్టించుకోకుండా కేవలం ప్రమాదాలు జరుగుతున్నా యనే కోణంలో చూస్తున్నారు తప్ప అవి దేనివల్ల జరుగుతున్నాయని అధికారులు ఒకసారి పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు స్థానికులు?. గ్రానైట్ లారీ తెల్లవారుజాము జరగటంతో ఎవరూ లేకపోవడం పెను ప్రమాదం తప్పిందని డివైడర్ను ఢీకొని పైకి ఎక్కటం జరిగింది. ప్రమాదానికి గురైన లారీ ని పోలీసులు క్రేన్ సహాయంతో వాటిని తొలగించారు. చెరువుకు వెళ్లే రోడ్డు నుండి బస్టాండ్ వరకు ఇరువైపులా ఆటోలను నిలపకుండా ప్రయాణికులను దించి వెంటనే వెళ్లే విధంగా పోలీసులు ఒకసారి ఈ విషయాన్ని గమనించాలని బస్టాండ్ కి వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నామని వారు పేర్కొంటున్నారు.

# రామన్నపేట మండలంలో ఆకస్మిక తనిఖీలు చేసిన జిల్లా కలెక్టర్



**రామన్నపేట అక్టోబర్ 21(పిసీడబ్ల్యూ న్యూస్):** రామన్నపేట మండలంలో జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో పల్లె దవఖానాను సందర్శించి ఎంత మంది సిబ్బంది వున్నారు.ప్రతి రోజు సమయానికి విధులకు వస్తున్నారా లేరా, రోగులకు సరిపడా మందులు ఉన్నాయా, లేవా,గత నెలలో ఎన్ని ఈడిడి లు వున్నాయి. ఈ నెలలో ఎన్ని వున్నాయి.ఇప్పటివరకు అయినవి ఎన్ని, ఎక్కడ డెలివరీ జరిగాయి అని అడిగి తెలుసుకున్నారు.తరువాత అదే గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బోగారంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి రైతులతో అధికారులతో మాట్లాడారు. తదుపరి మండలంలో నిర్మాణంలో వున్న ఇందిరమ్మ ఇండ్ల పనులకు సంబంధించి నిర్మాణ స్థితిగతులను,నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లాల్ బహదూర్ శాస్త్రి,ఎమ్ పిడివో ఏ. రాములు,సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డిమార్కెట్ కమిటీ మెంబర్ పెద్ద బోయిన వెంకన్న సీఈఓ .జంగారెడ్డిఎంపీ ఓ ఏవో ఎజాజ్ అలీ ఖాన్ ఏపీఎం జానీవెలుగు సిసి . వెంకన్నఏఈఓ కిరణ్జిపిఓ పంచాయతీ సెక్రెటరీ సైదిరెడ్డిఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పరకాలలో టపాసుల వ్యాపారులకు భారీ నష్టం



**పరకాల, అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** దీపావళి పండుగ సందర్భంగా పరకాలలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఈ సంవత్సరం మొత్తం 28 టపాసుల దుకాణాలు ప్రారంభమయ్యాయి. ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా పెద్ద ఎత్తున ప్రజలు వస్తారని వ్యాపారులు ఆశించినా, పరిస్థితి పూర్తిగా తారుమారైంది.వ్యాపారులు చెబుతూ, "ఈసారి అమ్మకాలు సగానికి తగ్గాయి. 50 శాతం పైన నష్టం వాటిల్లింది. టపాసుల ధరలు పెరగడంతో పాటు కొనుగోలుదారుల సంఖ్య గణనీయంగా తగ్గింది. పిల్లలు, యువత టపాసుల కంటే లైటింగ్, డెకరేషన్ వైపు మొగ్గు చూపుతున్నారు," అని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఇకపై మరో పెద్ద సమస్యగా, ప్రభుత్వ శాఖలకు చెందిన కొంతమంది ఉద్యోగులు, వర్కర్లు దుకాణాల వద్దకు వచ్చి "ఫ్రీగా ఇవ్వండి", "డిస్కౌంట్ ఎక్కువ ఇవ్వండి" అంటూ ఒత్తిడి తెస్తున్నారని వ్యాపారులు తెలిపారు. "మేము లాభం చూడకపోతే వచ్చే సంవత్సరం షాపులు ఎలా వేయగలం?" అంటూ వారు ప్రశ్నించారు.పరకాల టపాసుల వ్యాపార సంఘం ప్రతినిధులు కూడా మాట్లాడుతూ, "ప్రతి ఏడాది ఖర్చులు పెరుగుతున్నాయి కానీ అమ్మకాలు తగ్గిపోతున్నాయి. ఫ్రీ డిమాండ్లు, అధిక రేట్లు, వినియోగదారుల నిరాసక్తత ం ఇవన్నీ కలిపి ఈ సంవత్సరం దీపావళి వ్యాపారం మాకు నష్టాల దీపావళిగా మారింది," అని పేర్కొన్నారు.వ్యాపారులు ప్రభుత్వాన్ని కోరుతూ, టపాసుల దుకాణాల ఏర్పాటులో సదుపాయాలు కల్పించాలని, భద్రతా చర్యలు మెరుగుపరచాలని, అలాగే వారి సమస్యలను గుర్తించి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# కొత్తపల్లి కబ్రిస్తాన్‌కు ప్రహరీ గోడ నిర్మాణం అవసరం

**• మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసిన యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్..**



**కరీంనగర్ జిల్లా అక్టోబర్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మహమ్మద్ అజీమ్ ఈరోజు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిశారు.ఈ సందర్భంగా అజీమ్ మంత్రికి కొత్తపల్లి గ్రామంలోని నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దర్గా హజ్రత్ సయ్యద్ అహ్మద్ షా వలి రహ్మతుల్లా అలే మరియు దర్గా హజ్రత్ సయ్యద్ హాబీబ్ షా వలి రహ్మతుల్లా అలె వద్ద ముస్లిం కబ్రిస్తాన్‌కు ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయవలసిందిగా వినతిపత్రం సమర్పించారు.అజీమ్ మాట్లాడుతూ... "ప్రస్తుతం కబ్రిస్తాన్ చుట్టూ గోడ లేకపోవడంతో అది అసురక్షితంగా మారింది. పశువులు, చెత్త పడేయడం వంటి సమస్యలు ముస్లిం కమ్యూనిటీకి తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నామనీ" అన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ వినతిపత్రం స్వీకరించి, ఈ విషయాన్ని సమీక్షించి సానుకూలంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు మరియు ముస్లిం కమ్యూనిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిర్మానుష్య ప్రదేశలలో, పోకిరిల పాడు పనులు పట్టించుకోని అధికారులు...



**కరీంనగర్ టౌన్ అక్టోబర్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని కమాన్ నుండి కేబుల్ బ్రిడ్జి వరకు రాత్రి కాగానే నిర్మానుష్య ప్రాంతలలో పోకిరిలు మద్యం తాగి సీసాలు పగులగొట్టి రోడ్ల మీద పడేస్తూ అటునుండి వెళ్ళే వారితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు, సిగరెట్ పీకలు, గుట్కా ప్యాకెట్లు విచ్చలవిడిగా పడవేస్తు. రోడ్డు మీదనే గుట్కాలు తిని ఉన్నివేస్తు అపరిశుభ్రం చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు, విధులలో స్ట్రీట్ లైట్లు వెలగకపోవడం, వల్లే చెడు వ్యసనాలకు బానిసలైన వారు విధులను అడ్డాలుగా ఎంచుకున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించి పోకిరిలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా విధులల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి ఆట అరికట్టవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## పాఠ్య పుస్తకాల పంపిణి



**వాజేడు, అక్టోబర్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** వాజేడు మండల విద్యా వనరుల కేంద్రం నందు ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్య పుస్తకాలు పార్ట్ 2 వివిధ పాఠశాలను వాజేడు మండల విద్య శాఖ అధికారి తెజోవత్ వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు.అలాగే ఉల్లాస్ మెటీరియల్ ను సెర్ప్ ఏపీఎం సహకారంతో వాలంటీర్లకు సంబంధించిన మార్గదర్శిని, బ్రౌజర్స్, లెర్నర్స్ కు సంబంధించిన అక్షర వికాసం పుస్తకాలను పంపిణీ చేయడం జరిగినది.

## పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు



**గంగాధర, అక్టోబర్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోఈరోజు అనగా 21/10/2025 పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవము సందర్భంగా విధి నిర్వహణలో భాగంగా 2008 సంవత్సరం విజయనగరం జిల్లా బలిమెలలో జరిగిన నక్సలైట్ల దాడిలో ప్రాణాలు కోల్పోయిన గంగాధర మండలానికి చెందిన గుజ్జేటి మహేష్ కి పోలీస్ స్టేషన్ ఆవరణలో స్థానిక SI వంశీకృష్ణ, MPDO, MRO అంబట్ల రజిత, మహేష్ కుటుంబ సభ్యులు , పోలీస్ సిబ్బంది నివాళులు అర్పించడం జరిగింది మరియు మహేష్ కుటుంబ సభ్యులను సత్కరించడం జరిగింది.

## ఘోర రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి







**గంగాధర, అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో వివరాలలోకి వెళితే తేదీ 21 /10/2025 ఉదయం అందాద 7:30 గంటల సమయంలో గంగాధర మండలం కొండన్నపల్లి కి చెందిన తొర్రికొండ మల్లయ్యఏ రాజమల్లు కొమురయ్య వయసు 55 సంవత్సరాలు కరీంనగర్ నుండి తన స్వగ్రామమైన కొండన్న పల్లికి కారులో (AP 15AL 9792)తన భార్య మరియు అతని మేనత్తతో కలిసి వస్తుండగా కొండన్నపల్లి శివారులో వెనక నుండి జగిత్యాల వైపు వెళ్తున్నా ద్విచక్ర వాహనం (TS 08GW 2730) డ్రైవ్ చేస్తున్నటువంటి ఉత్తరప్రదేశ్ కు చెందిన ఇమ్రాన్ షాప్ జబ్బర్షా ,వయస్సు 30 సంవత్సరాలు అతివేగంగా వచ్చి కారుని వెనుక నుండి ఢీకొట్టగా కారు అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీకొట్టడం వలన కారు డ్రైవ్ చేస్తున్నటువంటి మల్లయ్య తలకి తీవ్ర గాయమై మృతి చెందడం జరిగింది మరియు బైక్ డ్రైవర్ ఇమ్రాన్ షా కి కూడా తలకి తీవ్ర గాయాలు అవ్వడం వలన అతడు కూడా మృతి చెందడం జరిగింది.

# పేద విద్యార్థి మృతిపై పరిమళించిన మానవత్వం

- ఎంఐఎం నేత గులాం అహ్మద్ విజ్ఞప్తికి స్పందించిన సెక్రటరీ షఫీఉల్లా
- టెమ్రీస్ సొసైటీ ద్వారా మృతుడి కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం..రూ.2లక్షల సాయం...
- మరింత ఆర్థిక సాయం అందించడానికి ముందుకొచ్చిన టేమ్రిస్ ఉద్యోగులు, సిబ్బంది
- తక్షణ సాయం కింద రూ. 20వేలు అందజేత





**కరీంనగర్ జిల్లా అక్టోబర్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని మైనారిటీ గురుకుల బాలుర కళాశాల-3 మగ్దూమ్ పూర్ లో ఇంటర్ ఒకేషనల్ ఫస్టియర్ చదువుతున్న మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం అన్నారంకు చెందిన విద్యార్థి నదిముద్దీన్, అనుకోని సంఘటనలో లారీ ఢీకొనడంతో రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందాడు. ఈవిషయం తెలిసిన వెంటనే ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీకి ఫోన్ ద్వారా ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సమాచారం అందించారు. మృతుడు విద్యార్థి నదీమ్ కు తండ్రి లేడని, తల్లి డయాలసిస్ పేషేంట్ అని, ఒక మైనర్ సోదరి ఉందని, పూర్తిగా నిరుపేద కుటుంబానికి చెందిన వాడని గులాం అహ్మద్ వివరించారు. బారిష్టర్ అసదుద్దీన్ ఆదేశాల మేరకు ఈఅంశంపై మాట్లాడడానికి గులాం అహ్మద్ మంగళవారం ఉదయం హైదరాబాద్ వెళ్లి.. తెలంగాణ మైనారిటీ గురుకులాల సెక్రటరీ బి షఫీఉల్లాను నాంపల్లి టేమ్రిస్ హెడ్ ఆఫీస్ లో కలిసి, మృతుడు విద్యార్థి నదిముద్దీన్ కుటుంబ దీన పరిస్థితిని, టేమ్రిస్ సెక్రటరీ కి వివరించారు. టేమ్రిస్ ద్వారా ఒక లక్ష సాయమే అందిచాల్సి ఉండగా, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ సూచనతో, గులాం అహ్మద్ హుస్సేన్ విజ్ఞప్తి మేరకు రూ.2లక్షల ఆర్థిక సాయాన్ని అందించడం తోపాటు మృతుని కుటుంబంలో ఒకరికి సొసైటీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని, సెక్రటరీ షఫీఉల్లా హామీ ఇచ్చారని గులాం అహ్మద్ తెలిపారు. కాగా మృతుడి కుటుంబానికి పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అందించడానికి ఉమ్మడి జిల్లాకు చెందిన టెమ్రీస్ ఉద్యో గులు, సిబ్బంది ముందుకు వచ్చారు. ఈమొత్తం నగదును మృతుడి కుటుంబ సభ్యుల పేరిట డిడి లేదా చెక్కు రూపంలో అందజేస్తామని అధికారులు తెలిపారు. తమ అధినేత సూచనతో తన విజ్ఞప్తి మేరకు మానవతా దృక్పథంతో స్పందించి, పేద కుటుంబానికి ఆసరాగా నిలిచిన టేమ్రిస్ సెక్రటరీ షఫీ ఉల్లాకు గులాం అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చి సాయం చేస్తామని ప్రకటించిన టేమ్రిస్ కరీంనగర్ జిల్లా ఉద్యోగులకు, సిబ్బందికి ఎంఐఎం నేతలు ధన్యవాదాలు తెలిపారు.

## గంగాధరలో శ్రీ వాసవి అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం






**గంగాధర అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మండల కేంద్రంలో మధుర నగర్ చౌరస్తాలో శ్రీ వాసవి అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారము అమావాస్య రోజున అన్న ప్రసాద వితరణ కార్యక్రమము ప్రారంభోత్సవం చేసినా ము . ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎమ్మార్వో అంబట్ల రజిత చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసినారు. ఎమ్మార్వో రజిత మాట్లాడుతూ శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య రోజు అన్న ప్రసాద వితరణ కాకుండా పౌర్ణమి రోజురకూడా చేస్తే బాగుంటుంది అని చెప్పినారు ఆకలితో ఉన్నవారికి భోజనం పెట్టడం చాలా మంచి కార్యక్రమం అని చెప్పినారు ఇట్టి కార్యక్రమానికి వేముల అంజి మరియు డాక్టర్ దొంతుల మనోహర్ మరియు శ్రీ వాసవి అన్నపూర్ణ సేవ సమితి వ్యవస్థాపకులు నలుమాచు హరికిషన్,రేగురి కరుణాకర్,తంశెట్టి శ్రీనివాస్, మంచాల శ్రీనివాస్ మరియు సభ్యులందరూ పాల్గొన్నారు.

## కరీంనగర్లో సమాధుల వద్ద దీపావళి సంబరాలు...





**కరీంనగర్,అక్టోబర్21(పీసీడబ్ల్యూ న్యూస్):** దీపావళి పండగ రోజున అందరూ తన ఇండ్లలో లక్ష్మీ పూజలు చేసుకుంటూ కుటుంబ సభ్యులతో సంబరాలను చేసుకుంటుంటే, మరోవైపు గత కొద్ది సంవత్సరాలుగా కరీంనగర్ కారా?నా గడ్డ హిందూ స్మశాన వాటికలో చనిపోయిన వారిని స్మర్షించుకుంటూ సమాధులను పూలతో అలంకరించి, దీపాలను వెలిగించి ప్రార్థనలు చేస్తూ, వారి ఆశిస్సులు తీసుకొని, వారికి ఇష్టమైన ఆహారాలను సమాధుల వద్ద పెట్టి వారితో పండగ వాతావరణం సృష్టించి, వయసుతో సంబంధం లేకుండా కుటుంబ సభ్యులు చిన్న పెద్దలు అందరూ కలిసి అర్ధరాత్రి వరకు పండగ సంబరాలు టపాసులు కాలుస్తూ చేసుకోవడం జరిగినది. ప్రతి ఏటా జరిగే ఈ కార్యక్రమానికి దూర ప్రాంతం నుండి తన బాంధవులు ఈ పెద్దల పండుగకు రావడం విశేషం.ఈ కార్యక్రమానికి అన్ని సౌకర్యాలతో సక్రమంగా ఏర్పాటుచేసిన కరీంనగర్ నగరపాలక సంస్థ సిబ్బందికి ఏరియా మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.


# గురుకుల విద్యార్థి మృతిపై టెమ్రీస్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి విచారణ...

- ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి
- జిల్లా ఇంచార్జికి ఎంఐఎం నేత ఆరిఫ్ అహ్మద్ విజ్ఞప్తి









**కరీంనగర్ రూరల్, అక్టోబర్21 (పీసీడబ్ల్యూ న్యూస్):** నగరంలోని మైనారిటీ గురుకుల బాలుర కళాశాల-3 మగ్ధూమ్ పూర్ లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం అన్నారంకు చెందిన విద్యార్థి నదిముద్దీన్, అనుకోని సంఘటనలో రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందాడు. కళాశాల పక్కనే రాజీవ్ రహదారిపై లారీ ఢీ కొట్టడంతో విద్యార్థి నదీమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ అంశంపై మైనారిటీ గురుకుల హెడ్ ఆఫీస్ హైదరాబాద్ నుంచి జిల్లా ఇన్చార్జి మహమ్మద్ సుభాన్ మంగళవారం మగ్ధూమ్ పూర్ మైనారిటీ గురుకులాన్ని సందర్శించారు. ఘటనకు జరిగిన అంశాలపై అరా తీసి, ఉద్యోగులతో, సిబ్బందితో, పిల్లలతో మాట్లాడి, వివరాలను నోట్ చేసుకున్నారు. విచారణకు వచ్చిన అధికారి సుబహాన్ ను ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ గారి ఆదేశాల మేరకు ఎంఐఎం నేత, మాజీ కార్పొరేటర్ ఆరిఫ్ అహ్మద్, ఖాజా మజాహారోద్దీన్ లు కలిసి కళాశాలలో నెలకొన్న పరిస్థితులపై మాట్లాడారు. మృతుడి కుటుంబానికి శాఖ పరంగా, ఉద్యోగుల తరపున ఆర్థిక సాయం అందించేలా కృషి చేయాలని జిల్లా ఇన్చార్జి కి విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యార్థి నదీముద్దీన్ కుటుంబ సభ్యులతో మాజీ కార్పొరేటర్ ఆరిఫ్ అహ్మద్ మాట్లాడారు. సంఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళాశాలలో వెనకవైపు గోడ మూడు ఫీట్లు మాత్రమే ఉండడంతో విద్యార్థులు సులువుగా బయటికి వెళ్లే అవకాశం ఉన్నందున ఈ ప్రమాదం జరిగిందని ఎంఐఎం నాయకులు జిల్లా ఇన్చార్జి దృష్టికి తీసుకెళ్లారు. ప్రహరీ గోడ ఎత్తు పెంచాలని, విద్యార్థులకు తగినంత సెక్యూరిటీ కల్పించాలని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకోవద్దని వారికి స్వేచ్ఛగా చదువు చెప్పడంతో పాటు తగినంత సెక్యూరిటీ కల్పించాలని, భద్రతాపరమైన లోపాలు ఎక్కువగా ఉన్నాయని, సీసీ కెమెరాల పనితీరు లేదని వీటిని తక్షణమే బాగు చేయాలని లేకుంటే మరో సంఘటన పునరాభృతమైతే ఎంఐఎం పార్టీ పక్షాన ఊరుకోబోమన్నారు. తక్షణ సాయం కింద 20వేలను ఎంఐఎం నేత ఆరిఫ్ అహ్మద్, మజహరోద్దీన్ ల సమక్షంలో మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కాగా విద్యార్థి మృతదేహానికి శవపరీక్షలు పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియల కోసం స్వగ్రామానికి, మృతుడి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మగ్ధూమ్ పూర్ మైనారిటీ గురుకుల పాఠశాలలో సుల్తానాబాద్ సర్కిల్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఎంఈవో రవీందర్, సుల్తానాబాద్ మైనారిటీ నాయకులు, మైనార్టీ గురుకులాల ప్రిన్సిపాల్లు చంద్రమోహన్, మహేశ్, సాగర్, సంపత్, కుమారస్వామి, శ్రీధర్, సురేశ్, విజిలెన్స్ అధికారులు అక్రమ్ పాషా, ఇంతియాజ్ , ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

## కల్లుగీత కార్మిక సంఘ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక





**నర్సింహులపేట అక్టోబర్21 (పీసీడబ్ల్యూ న్యూస్):** నర్సింహులపేట మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన ఆవరణలో కల్లు గీత కార్మిక సంఘం ఐదో మండల మహాసభ సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యమగాని వెంకన్న, గౌని వెంకన్న హైజరై వీరి ఆధ్వర్యంలో మండల కల్లుగీత కార్మిక సంఘ నూతన కమిటీని ఏకగ్రీవం చేశారుఅధ్యక్షులు:- డొనికెని రామన్న ప్రధాన కార్యదర్శి:- చిర్ర సతీష్ ఉపాధ్యాక్షులు:- గుండగాని వెంకన్న కోశాధికారి:- దొంతు రాంముర్తిసహాయక కార్యదర్శి:-చలమల్ల వెంకన్న గౌరవ అధ్యక్షురాలు:- చలమల్ల యాదగిరి సోషల్ మీడియా కన్వీనర్:-కోల యాకయ్యఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ప్రతి సొసైటీకి 5 ఎకరాలు భూమి ఇవ్వాలని, పెండింగ్ ఎక్స్గ్రేషియ విడుదల చేయాలని, గీతా వృత్తి రక్షణ కోసం 500 కోట్లతో కార్పోరేషన్ ఏర్పాటు చేసి గీతా వృత్తి చేసే ప్రతి కార్మికునికి మోటార్ బైక్, 50 ఏండ్లు నిండిన కార్మికులకు పెంచన్, గీతా కార్మికులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా నూతన కల్లుగీత కార్మిక సంఘ అధ్యక్షుడు డొనికెన రామన్న మాట్లాడుతూ నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపుతు, కల్లుగీత కార్మిక సంఘం హక్కుల సాధన కోసం పోరాడతానని గీతా కార్మికుల ఐక్యత కోసం కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారు గునిగంటి మోహన,గౌడ కుల అధ్యక్షులు డొనికెన జంపన్న, సీతారాములు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## "తెలంగాణ రైజింగ్ - 2047 "

# సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి

- జిల్లా పౌరసంబంధాల అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్.
- ఈనెల 25తో ముగియనున్న సర్వే




**మహబూబాబాద్ అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన "తెలంగాణ రైజింగ్ - 2047 " సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారని జిల్లా పౌరసంబంధాల అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు.భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ - 2047 " సిటిజన్ సర్వేను చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుందని, ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున www.telangana.gov.in/telanganarising అనే వెబ్సైట్ ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు, సూచనలను అందించాల్సిందిగా అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):**విధి నిర్వహణలో పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డి సి పి కరుణాకర్, ఇతర పోలీసు ఉన్నతాధికారులతో కలిసి హాజరై అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం 2 నిమిషాలు మౌనం పాటించారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగాలకు వెనుకాడకుండా సేవలు అందించే పోలీసులు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజల రక్షణలో తమ ప్రాణాలను అర్పించిన పోలీసులు ఆచరించిన మార్గం స్ఫూర్తితో ప్రజల శ్రేయస్సుకు కృషి చేయాలని, చిత్తశుద్ధి, నీతి, నిజాయితీతో పని చేయాలని, పోలీసు అమరుల త్యాగాలు మరువలేమని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. పోలీసు అమరుల కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వారికి ఎలాంటి సమస్య రాకుండా అండగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు డి సి పి (అడ్మిన్) శ్రీనివాస్, మంచిర్యాల ఎ. సి. పి. ప్రకాష్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, ఏ ఓ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు, ఆర్ ఐ లు, ఆర్ ఎస్ ఐ లు, సి పి ఓ, స్పెషల్ పార్టీ, ఏ. ఆర్. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దీపాల కాంతులవలె ప్రతి ఒక్కరి ఇంటా వెలుగులు నిండాలి

**షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు**

**ఆల్ఫా ఫిట్నెస్ సెంటర్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన నిర్వాహకులు మహేష్, ఉదయ్**




**షాద్ నగర్, అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** తమ వ్యాపారం దినదిన అభివృద్ధి చెందుతూ విశిష్ట సేవలు అందించేలా నూతన సదుపాయాలను ఏర్పాటు చేశామని ఆల్ఫా ఫిట్నెస్ సెంటర్, మహబూబ్నగర్ రోడ్డు, బజాజ్ షోరూం బిల్డింగ్ సెకండ్ ఫ్లోర్ నిర్వాహకుడు మహేష్ మరియు ఉదయ్ అన్నారు.చీకటిని వెలుగు తరిమికొట్టడాన్ని..చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా మనమంతా దీపావళి పండుగు జరుపుకుంటామని పేర్కొన్నారు. దీపావళితో వ్యాపారంలో తమ మంచి వెలుగులు రావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తమ స్వలాభం కోసమే ఎజెండాగా కాకుండా ప్రజల ఆరోగ్య ఫిట్నెస్ లో ఎన్నో సేవలను అందిస్తున్నామని స్పష్టం చేశారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పరంగా మెరుగుపరుచుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రజలు గ్రీన్ టపాసులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆరోగ్య రీత్యా అందరూ జాగ్రత్తలు పాటించాలని.. శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు బాణాసంచకు దూరంగా ఉండాలని అన్నారు. పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దలు దగ్గరే ఉంటూ జాగ్రత్తలు పాటించాలన్నారు.

# షాద్ నగర్ నియోజకవర్గం ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు

- టిఆర్ఎస్ యువ నాయకులు జెట్ట నగేష్



**షాద్ నగర్, అక్టోబర్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** వెలుగుల పండుగ దీపావళి అని, దీపాల కాంతులవలె షాద్ నగర్ నియోజకవర్గం లోని ప్రజల ఇంటవెలుగులు నిండాలని ఆకాంక్షిస్తూ దీపావళి పండుగ సందర్భంగా నియోజకవర్గం, మోత్కూల గూడ గ్రామపంచాయతీ ప్రజలందరికి టిఆర్ఎస్ యువ నాయకులు జెట్ట నాగేష్ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచిసాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామన్నారు. చీకటిని పారద్రోలే వెలుగుల పండుగతో ప్రజ లందరికీ జీవితాలలో చీకట్లు తొలగి పాడి పంటలతో సుఖ సంతోషాలతో అభివృద్ధితో వెల్లివిరియాలన్నారు. అగ్ని కొలువైన దీపాల వెలుగులు మనలో అజ్ఞానాంధకారాన్ని తొలగించి, చైతన్యాన్ని రగిలించాలన్నారు. దీపావళి పర్వదినం సందర్భంగా ప్రతి ఒక్కరు బాణ సంచా పేల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చిన్న పిల్లలను బాణాసంచాకు దూరంగా ఉంచాలని ఆయన సూచించారు.

# పేదల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం..!

- రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ళు
- నేలపట్ల గ్రామాభివృద్ధికి 6 కోట్ల 31 లక్షల నిధులు మంజూరు
- ధర్మతండా గ్రామ అభివృద్ధికి 5 కోట్ల 95 లక్షల నిధులు మంజూరు
- ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి





**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పేదల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.మంత్రివర్యులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలంలో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... నేలపట్ల గ్రామంలో ముదిగొండ రోడ్డు నుంచి కొత్త చెరువు వరకు 2 కోట్ల 75 లక్షలతో బీటి రోడ్డు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. మునిగేపల్లి నుంచి వీరేంద్ర స్వామి దేవస్థానం వయా వెంకటాపురం మీదుగా 8 కిలోమీటర్ల మట్టి రోడ్డు 3 కోట్ల రూపాయలతో మంజూరు చేశామని, త్వరలోనే ఆ పనులకు శంకుస్థాపన చేస్తామని అన్నారు. నేలపట్ల గ్రామంలో 34 లక్షల రూపాయలతో అంతర్గత సిసి రోడ్లు నిర్మించామని, మరో 15 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. అంగన్వాడి భవనానికి 5 లక్షల రూపాయలు, త్రాగునీటి మరమ్మతు పనులకు రెండు లక్షల రూపాయలు, ప్రజా ప్రభుత్వంలో గడిచిన 22 నెలల కాలంలో 6 కోట్ల 31 లక్షల రూపాయలు నేలపట్ల గ్రామ అభివృద్ధికి మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ధర్మతండ గ్రామంలో 3 కోట్ల 75 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. లోక్య తండా నుంచి ధర్మ తండా వరకు కోటి 26 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన రోడ్డు ప్రస్తుతం టెండర్ దశలో ఉందని, వర్షాకాలంలోపు ఆ రోడ్డు శంకుస్థాపన చేస్తామని, రాబోయే వర్షాకాలంలోపు ఈ రోడ్లు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని అన్నారు. గత 22 నెలల కాలంలో ప్రజల ఆశీర్వాదంతో ధర్మతండా గ్రామానికి 46 లక్షలతో అంతర్గత సిసి రోడ్లు నిర్మించుకున్నామని అన్నారు. 20 లక్షల రూపాయలతో గ్రామ పంచాయతీ భవనం నిర్మించామని, మొత్తం ధర్మతండా గ్రామానికి 5 కోట్ల 95 లక్షల నిధులు అభివృద్ధి కోసం మంజూరు చేయడం జరిగిందని అన్నారు. పేదల ఆశీర్వాదంతో వచ్చిన ప్రజా ప్రభుత్వం పేద కుటుంబాలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్తు, ఉగాది నుంచి రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం, నూతనంగా పేద కుటుంబాలకు రేషన్ కార్డుల జారి, పాత రేషన్ కార్డులలో నూతన సభ్యుల పేర్లు నమోదు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతును రాజు చేయడంలో భాగంగా మొదటి ఏడాదిలో 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయల 2 లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాకు 500 రూపాయల బోనస్ అందించామని, ప్రస్తుత సీజన్లో కూడా బోనస్ ఇవ్వడానికి క్యాబినెట్ నిర్ణయించిందని, రాబోయే వారం నుంచి పది రోజులలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. పేద ప్రజలకు భరోసా, ధైర్యం అందించేలా ఇందిరమ్మ ఇండ్లను ప్రజా ప్రభుత్వం నిర్మిస్తుందని, పేద ప్రజలకు ఇచ్చిన మాట మేరకు మొదటి దఫాలోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3500 చొప్పున రాష్ట్రంలో మొత్తం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, మన నేలపట్ల గ్రామంలో మొదటి విడత క్రింద 18 ఇండ్లు మంజూరు చేశామని, పేదలు ఎక్కడా ఇబ్బంది పడకుండా ప్రతి సోమవారం డబ్బులు విడుదల చేస్తున్నామని అన్నారు. పేదల పక్షపాతిగా ఉన్న ప్రజా ప్రభుత్వం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు వచ్చినా భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... నేలపట్ల గ్రామంలో 2 కోట్ల 75 లక్షలతో ముదిగొండ రోడ్డు నుంచి కొత్త చెరువు వరకు, ధర్మతండ గ్రామంలో 3 కోట్ల 75 లక్షలతో ఆర్ అండ్ బి రోడ్డు నుండి వెంకట్రామాపురం ఆర్ అండ్ బి రోడ్డు వరకు వయా ధర్మతండ బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు నేడు మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. గ్రామాలలో నిర్మించబోయే బీటీ రోడ్ల వల్ల రైతులకు రోడ్ కనెక్టివిటీతో పంట కొనుగోలు కేంద్రాలకు తరలింపుకు వెసులుబాటు కలుగుతుందని, రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో ఇంజనీరింగ్ అధికారులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు. ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబ్, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

# సంక్షేమం - అభివృద్ధి అమలుకు సమప్రాధాన్యం

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కొండాపూర్ గ్రామానికి 14 కోట్ల 11 లక్షల నిధులు మంజూరు
- ఖమ్మం జిల్లా, రూరల్ మండలంలో పర్యటించి రోడ్డు నిర్మాణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సమ ప్రాధాన్యం కల్పిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.మంత్రివర్యులు, ఖమ్మం జిల్లా, రూరల్ మండలంలో పర్యటించి కొండాపురం గ్రామంలో 30 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం, తల్లంపాడు గ్రామంలో ఖమ్మం సూర్యాపేట ఆర్ అండ్ బి రోడ్డు నుండి లక్ష్మీపురం వయా తల్లంపాడు నుండి తెల్దారుపల్లి వరకు 3 కోట్ల 58 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, 35 లక్షలతో నిర్మించనున్న అంతర్గత రోడ్ల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. కొండాపురం గ్రామంలో 30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని, గడిచిన 21 నెలలో 64 లక్షల 50 వేల రూపాయలతో అంతర్గత సిసి రోడ్లు పూర్తి చేశామని అన్నారు. ఒక కొండాపూర్ గ్రామానికి 94 లక్షల 50 వేల రూపాయలు అంతర్గత రోడ్ల కోసం కేటాయించామని తెలిపారు.కొండాపూర్ నుంచి మోటాపురం వరకు 7 కోట్ల 50 లక్షల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం, పొన్నేకల్ నుంచి కొండాపురం వరకు 5 కోట్ల 20 లక్షల రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను మంజూరు చేసి టెండర్లు ఆహ్వానించామని త్వరలోనే ఈ పనులకు శంకుస్థాపన చేస్తామని మంత్రి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 20 లక్షల రూపాయలతో, పెద్దకుంట చెరువు శాశ్వత మరమత్తు పనులను 25 లక్షల రూపాయలతో పూర్తి చేసామని అన్నారు. ఒక కొండాపూర్ గ్రామానికి గడిచిన 21 నెలల్లో 14 కోట్ల 11 లక్షల రూపాయలు అభివృద్ధి కోసం మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో పేద ప్రజలకు అందించిన హామీలను తూ.చ. తప్పకుండా అమలు చేస్తున్నామని అన్నారు. పేద మహిళలకు ఇబ్బందులు తొలగించేందుకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, ఉగాది నుంచి పేదలకు రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, మొదటి ఏడాది 25 లక్షల రైతులకు 21 వేల కోట్ల రూపాయల 2 లక్షల రూపాయలు రుణ మాఫీ చేశామని, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాకు 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. గత పది సంవత్సరాలలో పేదలకు ఇండ్లు కట్టించాలనే ఆలోచన గత పాలకులు చేయలేదని, మన ప్రభుత్వం మొదటి విడతలో 4.5 లక్షలు ఇండ్లు మంజూరు చేసిందని, కొండాపూర్ గ్రామంలో 30 ఇండ్లు వచ్చాయని, త్వరలో మిగిలిన అర్హులకు విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, జిల్లా వ్యవసాయ అధికారి జి. పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## చిన్ననాగారంలో కోలల ప్రకాశం సంప్రదాయానికి అంకితుడైన బైరు యాదగిరి

- దీపావళి వేకువజామున కోలలతో గ్రామమంతా వెలుగులు
- దుష్టశక్తుల నివారణకు దైవానుగ్రహం కోసం ప్రత్యేక ఆచారం
- స్వయంగా కోలలు తయారు చేసి గ్రామస్తులకు అందిస్తున్న యాదగిరి
- చిన్ననాగారంలో యుగాల నుంచి కొనసాగుతున్న ఆధ్యాత్మిక సంప్రదాయం

**ఇనుగుర్తి అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారం గ్రామంలో కోలల సాంప్రదాయానికి కొత్త ఊపిరినిస్తోంది బైరు యాదగిరి గౌడ్. ప్రతి సంవత్సరం దీపావళి పండగ వేకువ జామున గ్రామీయులు కలసి కోలలు తిప్పడం ఇక్కడ విశేష సంప్రదాయంగా కొనసాగుతుంది. దుష్టశక్తుల ప్రభావం తగ్గి గ్రామ ప్రజల జీవితాల్లో దివ్యశక్తులు వెల్లివిరియాలని ఆకాంక్షతో యాదగిరి స్వహస్తాలతో కోలలు రూపొందిస్తారు. అనంతరం గ్రామ పౌరుల చేత కోలలు తిప్పిస్తూ వారిలో ఆనందం, భక్తి, ఐక్యతను నింపుతున్నారు.కాలం మారుతున్నా విలువలు నిలిచేలా ఈ ఆధ్యాత్మిక ఆచారాన్ని చిన్ననాగారంలో ప్రతీ ఏడాది పునరుద్ధరిస్తూ గ్రామ సంస్కృతిని సజీవంగా ఉంచుతున్న యాదగిరి గ్రామస్థుల ప్రశంసలు అందుకుంటున్నారు.

# శాంతి భద్రతల సంరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

**• విపత్కర సమయాల్లో మొదటగా స్పందించేది పోలీసులు మాత్రమే • పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడంలో పోలీసుల సహకారం మరువలేనిది • ప్రతి పౌరులు పోలీసుల గొప్పతనం తెలుసుకోవాలి • పోలీస్ అమరవీరుల సంస్కరణ దినం సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**









**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** శాంతి భద్రతల సంరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా మంగళవారం పోలీసు పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, డిఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించిన పోలీసు అమరవీరులకు ప్రతి ఒక్కరూ నివాళులు అర్పించాలని అన్నారు. ప్రభుత్వంలో ప్రతి శాఖ పని తీరులో పోలీస్ సహకారం సంపూర్ణంగా ఉంటుందని అన్నారు. భూ సేకరణ, ధాన్యం కొనుగోలు, ఎన్నికల నిర్వహణ, శాంతియుతంగా వేడుకలు జరగాలన్నా కూడా ప్రతి ఒక్క అంశంలో పోలీస్ సహకారం అవసరమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఖమ్మం జిల్లా యంత్రాంగానికి పోలీసులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని అన్నారు. దీపావళి, హోళి, వినాయక నిమజ్జనం వంటి అనేక పండుగలు ప్రశాంతంగా జరుపు కోవడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రతి పౌరులు పోలీసుల గొప్పతనం తెలుసుకోవాలని, కృతజ్ఞతగా ఉండాలని, కానిస్టేబుల్ నుంచి డీజీపి వరకు నేర నియంత్రణ కోసం పాటు పడుతారని అన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన వెంటనే 100 కు ఫోన్ చేస్తారని, అన్ని విపత్కర సమయాలలో మొదటగా స్పందించేది పోలీసులు మాత్రమే నని, 24 గంటల పాటు డ్యూటీలో ఉంటారని అన్నారు. పోలీసులు ప్రతిరోజు కుటుంబ సమయాన్ని త్యాగం చేస్తూ మన కోసం విధులు నిర్వహిస్తున్నారని, అటువంటి వారిపట్ల మనం నిరంతరం గౌరవ భావంతో ఉండాలని అన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు శాంతి చేకూరాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసు కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ... 21 అక్టోబర్ 1959 లద్దాక్ ప్రాంతంలో దేశ సరిహద్దు కాపాడటంలో 10 మంది సిఆర్పిఎఫ్ సిబ్బంది చైనా సైనికులతో వీరోచితంగా పోరాడి మరణించారని, విధులలో ఉండి మరణించిన పోలీసుల త్యాగాలకు చిహ్నంగా మనం నేడు పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. గత సంవత్సర కాలంగా భారత దేశ వ్యాప్తంగా శాంతిభద్రతలు కాపాడేందుకు 191 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రతి పోలీసు వ్యక్తికి దేశం మొదటి ప్రాధాన్యతగా ఉండాలని అన్నారు. డిఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ... పోలీస్ యూనిఫామ్ చాలా పెద్ద బాధ్యత అని, ప్రతి రోజు క్రిమినల్స్ తో పోరాటం, చాలా కష్టాలతో విధులు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. సమాజంలో శాంతి భద్రతలు పకడ్బందీగా ఉండాలంటే పోలీసులు సరిగ్గా పని చేయాలని అన్నారు. పోలీసులు సరిగ్గా పనిచేస్తున్నారు అంటే దానికి వారి కుటుంబాలు కూడా చాలా సహకరిస్తున్నాయని తెలిపారు.అనంతరం విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు స్మారక స్థూపం వద్ద జిల్లా కలెక్టర్, పోలీసు కమీషనర్, అటవీశాఖ అధికారి పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ పేరడ్ మైదానంలోని అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించగా, పోలీస్ అమర వీరుల స్థూపం వద్ద జిల్లా అధికార యంత్రాంగం, పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబీకులు పూలమాలలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. తొలుత, అమర వీరుల స్మృత్యర్థం సాయుధ బలగాలు పెరేడ్, గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహించారు. అనంతరం పోలీసు ఆయుధాలు కిందకు దింపి వందనం చేసి రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి లు ప్రసాద రావు, రామానుజం, పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పట్టాలు ఇవ్వాలి

**• ప్రజా ప్రతినిదులు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదు • సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న**



**తొర్రూర్ అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** 6 నెలలుగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గోపాలగిరి రోడ్డులో నిర్మించిన ఇల్లు లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని చేస్తున్న పోరాటం ప్రజా ప్రతినిధులకు అధికారులకు కనిపించడం లేదా అని... పది రోజులుగా ఇల్లు లేని నిరుపేదలు డబుల్ బెడ్ రూమ్లలో ఉంటున్నా కూడా స్థానిక ఎమ్మెల్యే అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం ఎంతవరకు సమంజసం అని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న విమర్శించారు. మంగళవారం డబుల్ బెడ్ రూమ్ ల వద్ద సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎండి యాకూబ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజన్న మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయకుండా రెండు సంవత్సరాలు కాలయాపన చేసిందని ఆ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు వస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న ఇండ్లను పంపిణీ చేయకుండా కాలయాపన చేయడం సరికాదని అన్నారు. ఆ ప్రభుత్వం చేసిన పని ప్రస్తుత ప్రభుత్వం చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తయి నాలుగు సంవత్సరాలు అవుతుందని కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని గత ప్రభుత్వమే నిరంకుశ ప్రభుత్వమని గద్దె దించితే ప్రస్తుత ప్రభుత్వం కూడా వాళ్లకన్నా మేమేం తీసిపోలేదని దొందు దొందే అన్న రీతిలో ప్రస్తుత ప్రభుత్వ తీరు ఉందని అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి ఇల్లు లేని నిరుపేదలు గృహప్రవేశాలు చేసుకొని ఇండ్లలో ఉంటున్న వారికి వెంటనే పట్టాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. లేనియెడల శాంతియుతంగా చేస్తున్న పోరాటాన్ని అన్ని ప్రజా సంఘాలను కుల సంఘాలను ఐక్యం చేసి ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, మండల కమిటీ సభ్యులు మర్క సాంబయ్య డొనుక దర్గయ్య, పట్టణ కార్యదర్శి కొమ్మనబోయిన యాకయ్య, నాయకులు తిమ్మిడి రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎండి అమీర్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పోరాట సాధన కమిటీ శోభ, వరలక్ష్మి, శమీన, అమీన, అరుణ, భవాని, శ్రీలత, ధర్మన్న, అఖిల్, రేణుక, నాగమణి, మంజుల, రాధ, వసంత, కరుణ ప్రజా గాయకుడు గిద్దె రామ నరసయ్య, ఇల్లు లేని నిరుపేద లబ్ధిదారులు వినీత,మల్లయ్య,సాయిలు, సతీష్, రెడ్డబోయిన నరేష్, పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో పోలీస్ ఆధ్వర్యంలో క్యాండిల్‌తో ర్యాలీ

**పలు సంఘాల ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరులకు నివాళులు**

**విధి నిర్వహణలో అసువులు బాసిన అమరులకు ఘన నివాళులు**




**నర్సింహులపేట,అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల కేంద్రంలో పలుసంఘాల నాయకుల పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై మాలోతు సురేష్ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్బంగా చౌరస్తా నుండి అంబేద్కర్ సెంటర్ వరకు క్రొవత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశి స్థానిక ఎస్సై మాలోతు సురేష్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లవేళలా వారికి రుణపడి ఉంటుందని అన్నారు. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అమరవీరులకు క్రొవత్తులు వెలిగించి అంబెడ్కర్ సెంటర్ లో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా.విధులను నిర్వహిస్తూ అమరులైన పోలీసులను స్మరించుకోవడం జరిగింది. వారి త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని గుర్తు చేశారు. విరామం లేకుండా అనునిత్యం పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణే కాకుండా జిల్లాలో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో అలాగే.అకాల వర్షం వచ్చినప్పుడు. తదితర సందర్భలల్లో కూడా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భాగస్వామ్యం అవుతున్నారన్నారు. ప్రస్తుత సమాజంలో మారుతున్న నేర స్వరూపానికి అనుగుణంగా పోలీసులు సైతం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అతి తక్కువ వ్యవధిలో ఎంతో చాకచక్యంగా సైబర్ నేరాలను ఛేదిస్తూ, నేరస్థులను పట్టుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ హెచ్ ఓ సురేష్ కానిస్టేబుల్లు రవికుమార్,మమత, అజిత్, ప్రవీణ్, జోగేందర్ సింగ్, ఉష, నయీమ్ పాషా లతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జినుకల రమేష్, పలు సంఘాల నాయకులు మందుల యాఖుబ్, ఎర్ర దిలీప్ కుమార్, పటేల్ రామన్న, బానోత్ సురేష్, బండి రమేష్, ఇసంపెల్లి అనిల్, చౌడవరపు శ్రీనివాస్, గుండాల బిక్షం, ఎర్ర వెంకట్రాంనర్సయ్య, దాసరోజు వెంకటేశ్వర్లు, గుద్దేటి శంకర్, లచ్చు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవకురాలు, ప్రగతి వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకురాలు బూర్గుల సుమన ఇక లేరు



**షాద్ నగర్,అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం బూర్గుల గ్రామ మాజీ ఎంపీటీసీ,సర్పంచ్ బూర్గుల సుమన అనారోగ్యంతో ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఈమె హైదరాబాద్ మొదటి ముఖ్య మంత్రి బూర్గుల రామకృషా రావు సోదరుడి కుమార్తె , బూర్గుల నరసిం గరావు చెల్లెలు. ఈమె బూర్గుల గ్రామానికి ఒక సారి ఎంపీటీసీ గా మరియు సర్పంచ్ గా సేవలందించారు.. అంతే కాకుండా ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో తాను టీచర్ గా తన దగ్గర చదువుకున్న ఆ నాటి విద్యార్థుల సహకారం తో బూర్గులలో "ప్రగతి వెల్ఫేర్ అసోసియేషన్" ను స్తాపించి అనేక సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తూ, నేడు ఈ అసోసియేషన్ అనేక గ్రామాలకు విస్తరించి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుంది.. అంతేకాదు తాను చనిపోయినా తన శరీరం పదిమందికి ఉప యోగ పడాల ని హాస్పిటల్ కి దానం చేస్తున్నట్లు వీలునామా రాసుకున్న గొప్ప వ్యక్తి. ఆమె లేని లోటు బూర్గుల గ్రామ ప్రజ లతో పాటు చుట్టూ పక్కల ప్రజలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## బంగారుగడ్డ కభరస్తాన్ ప్రధాన రోడ్డుపై చిన్నపాటి వర్షానికె ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



**మిర్యాలగూడ,అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పట్టణంలోని బంగారుగడ్డ కబరస్థాన్ ప్రధాన రోడ్డుపై చిన్నపాటి వర్షానికే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కబరాస్థాన్ ఎదుదూరుగా ఉన్న ప్రధాన రహదారిపై సరైన డ్రైనేజీ లేక చిన్నపాటి వర్షానికే నీరు రోడ్లపై నిలచి, వాహనాలు మురుగు నీటిలో కిందపడి ఎన్నో ప్రమాదాలు జరగడమే కాకుండా, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సీజన్ వ్యాధులపై ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్న, ఈ డ్రైనేజీలు లేక రోడ్డుపైనే మురుగునీరు ప్రవహించడంతో, ఆ మురుగునీరు ఎటు పోలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు నిత్యం ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు.వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి, డ్రైనేజీని ఏర్పాటు చేసి, ప్రజల ఆరోగ్యం కాపాడాలని ప్రజాసంఘాల నేతలు, వాహదారులు కోరుతున్నారు

## మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి నివాసంలో ఉప ఎన్నికలపై సమావేశం

**• హాజరైన ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి,యల్ రమణ**

**• పాల్గొన్న ఎమ్మెల్యేలు లక్ష్మా రెడ్డి,మర్రి రాజశేఖర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి**



**షాద్ నగర్,అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ లు నవీన్ రెడ్డి,యల్ రమణ,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి,మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి.ఈ సందర్భంగా సోమాజిగూడ డివిజన్లోని అన్ని పోలింగ్ భూతులలో ప్రచార కార్యక్రమాల ఏర్పాటు పై చర్చించి మాగంటి సున్నితమ్మకు సోమాజిగూడ డివిజన్లో అధిక మెజారిటీ అందించేలా కృషి చేయాలని చర్చించారు.

# నఖ్వీపై చర్యలు తీసుకోనున్న బీసీసీఐ!!



ఆసియా కప్ ముగిసి చాలా కాలమైంది. ఇంత వరకు ట్రోఫీ మాత్రం భారత్‌కు రాలేదు. తన చేతుల మీదుగా తీసుకోలేదని మొండికేసిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ భారత్‌కు ట్రోఫీ ఇచ్చేందుకు అంగీకరించలేదు. తనతోపాటే తీసుకెళ్లిపోయారు. దీంతో ఈ వివాదం ఇంకా ముగిసిపోలేదు. భారత్ పలు రకాలుగా ఆయన్ని సంప్రదిస్తుంటే షరతులతో ఇచ్చేందుకు అంగీకరించారు. తన చేతుల మీదుగా తీసుకుంటేనే ఇస్తానని చెబుతున్నారు. దీంతో భారత్ మరిన్ని చర్యలు సిద్ధమవుతోంది. ట్రోఫీ వివాదంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో, బీసీసీఐ తదుపరి ఐసీసీ సమావేశంలో ఈ విషయంలో అంతర్జాతీయ బోర్డు జోక్యం చేసుకోవాలని కోరవచ్చు. బీసీసీఐ గత వారంలో ఒక లేఖను పంపిందని సమాచారం, అందులో ట్రోఫీని భారత జట్టుకు ఇవ్వాలని కోరారు, అయితే నఖ్వీ నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. టీమ్ ఇండియాకు ట్రోఫీని ఇవ్వాలి లేదా త్వరలో జరగనున్న ఐసీసీ సమావేశంలో ఈ సమస్యను లేవనెత్తుతామని బీసీసీఐ స్పష్టం చేసింది. ఏషియా కప్ ట్రోఫీ ప్రస్తుతం దుబాయ్‌లో ఉంది, అక్కడ అది ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ కార్యాలయంలో ఏసీసీ ఉంచారు. ఒక మీడియా నివేదికలో, బీసీసీఐకార్యదర్శి దేవ్జిత్ సైకియా మాట్లాడుతూ, భారత బోర్డు చట్టపరంగా ఒక్కో అడుగు వేస్తోందని చెప్పారు. ఏషియా కప్ ఫైనల్‌లో భారత జట్టు పాకిస్తాన్‌పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించిన తర్వాత మొహ్సిన్ చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోడానికి నిరాకరించడంతో ఈ వివాదం ప్రారంభమైంది. కొంత సమయం తరువాత, మొహ్సిన్ నక్వీ ట్రోఫీని తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొన్ని వారాల క్రితం సెప్టెంబర్ 30న ఏసీసీ సమావేశం జరిగింది, ఆ సమావేశంలో రాజీవ్ శుక్లా భారతదేశానికి ప్రతినిధిగా ఉన్నారు, అతను ప్రస్తుతం బీసీసీఐ ఉపాధ్యక్షుడు కూడా. ఆ సమావేశంలో రాజీవ్ శుక్లా మాట్లాడుతూ ట్రోఫీ ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ ఆస్తి అని, కాబట్టి నఖ్వీ వ్యక్తిగతంగా ట్రోఫీని మైదానం నుంచి తీసుకెళ్లే హక్కు లేదని అన్నారు. బోర్డు సభ్యుల ముందు క్షమాపణ చెప్పిన తర్వాత కూడా, అతను టీమ్ ఇండియాకు ట్రోఫీని ఇవ్వడానికి నిరాకరించాడు. టీమ్ ఇండియా ట్రోఫీని తీసుకెళ్లాలనుకుంటే, వారు నేరుగా దుబాయ్‌లోని కార్యాలయానికి వచ్చి అతని చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోవాలని ఆయన షరతులు పెడుతున్నారు. వీటికి టీమిండియా, బీసీసీఐ అంగీకరించడం లేదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ అమాయకులైన ప్రజలను పొట్టన పెట్టుకుంటుందని, జమ్ముకశ్మీర్‌లో జరిగిన దాడులు ఉదాహరణగా చూపిస్తూ ఆసియా కప్‌లో పాకిస్తాన్ క్రికెటర్లతో మాట, చేతులు కలపడానికి నిరాకరించింది. అంతేకాకుండా ఆ దేశానికి చెందిన నఖ్వీ చేతుల మీదుగా కూడా ట్రోఫీ అందుకోలేదు. దీన్ని మనసులో పెట్టుకొనే నఖ్వీ తనకు నచ్చినట్టు చేస్తున్నారు. ట్రోఫీని భారత్‌కు ఇవ్వకుండా అడ్డం పడుతున్నారు.

# రోహిత్, కోహ్లీలతో నా రిలేషన్ మారలేదు

## వన్డే కెప్టెన్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్



రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలతో తనకున్న రిలేషన్ గురించి వన్డే కెప్టెన్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్ స్పందించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలతో తన రిలేషన్ గతంలోలాగే ఉందని, తనకు ఏ అవసరం వచ్చినా ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లను సంప్రదించడానికి వెనుకాడనని గిల్ తెలిపాడు. సోషల్ మీడియాలో ఇటీవల వస్తున్న కథనాలపై ఈ విధంగా స్పందించాడు. భారత వన్డే జట్టుకు కెప్టెన్‌గా ఎంతో విజయవంతమైన రోహిత్ శర్మ స్థానాన్ని గిల్ భర్తీ చేశాడు. అప్పటి నుంచి ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు రోహిత్, కోహ్లీల భవిష్యత్తుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆదివారం పెర్త్ వేదికగా ప్రారంభం కానున్న ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల సిరీస్ భారత వన్డే కెప్టెన్‌గా గిల్ తొలి సిరీస్.స్వాన్ నది ఒడ్డున మ్యాచ్‌కు ముందు మీడియా సమావేశానికి హాజరు కావడం చాలా అసాధారణం. "బయట ఒక విషయం నడుస్తోంది, కానీ రోహిత్‌తో నాకున్న రిలేషన్‌లో ఏమీ మారలేదు. నేను ఏదైనా అడగాలనుకుంటే, సలహా కోరాలని భావిస్తే కచ్చితంగా రోహిత్ ను సంప్రదిస్తాను. పిచ్ స్వభావం గురించి సలహా కావాలన్నా, మ్యాచ్ గురించి అయినా రోహిత్ సహాయం చేస్తాడు" అని సిరీస్ ప్రారంభానికి ముందు గిల్ అన్నాడు. "నాకు విరాట్ భాయ్, రోహిత్ భాయ్‌లతో మంచి అనుబంధం ఉంది. నేను వెళ్లి ఈ పరిస్థితుల్లో కెప్టెన్ అయితే మీరేం చేస్తారు, ఎలాంటి నిర్ణయం తీసుకుంటారని నిర్మొహమాటంగా అడుగుతాను. సలహాలు ఇవ్వడానికి వారిద్దరూ ఎప్పుడూ వెనుకాడరు. 25 ఏళ్ల కెప్టెన్‌ను. నామీద పెద్ద బాధ్యత ఉంది. ఇద్దరు మాజీ కెప్టెన్ల నుండి చాలా మద్దతు అవసరం. టీమ్‌ను ఎలా ముందుకు తీసుకెళ్లాలి, ఏ రకంగా నిర్ణయాలు తీసుకుని జట్టును ముందుకు తీసుకెళ్లాలనే దానిపై విరాట్ భాయ్, రోహిత్ భాయ్‌లతో నేను చాలాసార్లు మాట్లాడాను. వారి అనుభవాలు మాకు సహాయపడతాయి' అని గిల్ పేర్కొన్నాడు. "మహీ భాయ్ (ఎంఎస్ ధోని), విరాట్, రోహిత్ అందించిన వారసత్వం, ఎన్నో అనుభవాల నుంచి నేర్చుకున్న విషయాలు చాలా ఉన్నాయి. వారి అనుభవం, నైపుణ్యం చాలా గొప్పది. వారి ఆట చూస్తూ పెరిగాను. వారిని నేను ఆరాధించేవాడిని, అది నన్ను ప్రేరేపిస్తుంది. అలాంటి దిగ్గజాలు నా సారథ్యంలో ఆడటం గొప్ప గౌరవంగా భావిస్తాను. జట్టుకు ఏ విధంగా మెస్సేజ్ ఇవ్వాలి. ఆటగాళ్లలో ఎలా కమ్యూనికేషన్ జరపాలి అనే విషయంపై రోహిత్, కోహ్లీలను అడిగి తెలుసుకున్నాను. వారితో కలిసి ఆడినప్పుడు కొన్ని విషయాలు నేర్చుకున్నాను. ఆస్ట్రేలియాతో సిరీస్ లో వారు ప్రత్యేకంగా నిలుస్తారు. రోహిత్, కోహ్లీలు దాదాపు 20 సంవత్సరాలుగా భారత క్రికెట్‌కు సేవలందించారు. వారి అనుభవాన్ని రిపీట్ చేయలేం. కానీ వ్యక్తిగతంగా, తనపై ఎంత ఎక్కువ బాధ్యత ఉంటే, అంత బాగా ఆడతానని నమ్ముతాను. కెప్టెన్సీ అనే అదనపు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తాను.నేను ఒత్తిడిలో రాణిస్తాను, నా అత్యుత్తమ ఆట బయటకు వస్తుంది. బ్యాటింగ్ చేసినప్పుడు బ్యాటర్‌గా ఆలోచిస్తాను, ఆపై బెస్ట్ నిర్ణయం నిర్ణయాలు తీసుకుంటాను. ఒక బ్యాటర్‌గా, నేను కెప్టెన్‌లా ఆలోచించడానికి మాత్రం ప్రయత్నించను. అలా చేస్తే ఒత్తిడి పెరుగుతుంది. దాంతో స్వేచ్ఛగా ఆడలేం. మన అత్యుత్తమ ఆట ప్రదర్శించలేమని" ఆసీస్ తో వన్డే సిరీస్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ భారత వన్డే కెప్టెన్ గిల్ కీలక విషయాలు వెల్లడించాడు.

# టీమ్ఇండియాకు చివరి ఛాన్స్



ఉమెన్స్ వన్డే వరల్డ్‌కప్‌లో ఉత్కంఠ భరిత వాతావరణం నెలకొంది. ఇప్పటికే మూడు జట్లు సెమీస్ బర్త్ ఖాయం చేసుకున్నాయి. ఇక మిగిలిన ఒక స్థానం కోసం ఐదు జట్ల మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. ఈ క్రమంలో వరుసగా మూడు పరాజయాలు ఎదుర్కొన్న టీమ్ఇండియా మహిళల జట్టు తన సెమీస్ అవకాశాలను క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టుకుంది. టీమ్ఇండియా ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌ల్లో 2 గెలిచి, 4 పాయింట్లతో పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఇక ముందున్న రెండు మ్యాచ్‌లు భారత్‌కు అత్యంత కీలకం. అక్టోబర్ 23న న్యూజిలాండ్‌తో, అక్టోబర్ 26న బంగ్లాదేశ్‌తో తలపడనుంది. సెమీఫైనల్ ఆశలను నిలబెట్టుకోవాలంటే ఈ రెండు మ్యాచ్‌ల్లో తప్పక గెలవాల్సిందే! ఒక మ్యాచ్ గెలిచి, మరోదాంట్లో ఓడినా టీమ్ఇండియాకు ఇంకా అవకాశం ఉంది! కానీ అది పూర్తిగా రేసులో ఉన్న ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. ఆ జట్ల కంటే మెరుగైన నెట్ రన్‌రేట్ సాధిస్తేనే భారత్ సెమీస్ బరిలో నిలుస్తుంది. అయితే, రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమి చవిచూస్తే సెమీస్ కల దాదాపు చెదిరినట్టే!ఇక టీమ్ఇండియాకు ఒక్క సానుకూల అంశం ఏంటంటే రన్‌రేట్ పాజిటివ్‌గా ఉండటం. న్యూజిలాండ్ ఇప్పటివరకు ఒకే మ్యాచ్‌లో విజయం సాధించినా, మరో రెండు మ్యాచ్‌ల ఫలితాలు తేలకపోవడంతో వారి ఖాతాలో నాలుగు పాయింట్లు చేరాయి. అయితే కివీస్ తమ తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే మాత్రం భారత్‌ను వెనక్కి నెట్టి సెమీస్ రేసులో ముందంజలోకి వచ్చేయొచ్చు! సోమవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక విజయం సాధించింది. ఈ విజయం త శ్రీలంక ఖాతాలో 4 పాయింట్లు చేరాయి. చివరి మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై గెలిస్తే, శ్రీలంక కూడా సెమీస్ రేసులోకి చేరే అవకాశం ఉంది. పాయింట్ల పట్టికలో చివరి స్థానాల్లో ఉన్న బంగ్లాదేశ్, పాకిస్థాన్ జట్లు సెమీస్ రేస్ నుంచి దాదాపు వెలుపలే ఉన్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా మాత్రం నాలుగేసి మ్యాచ్‌ల్లో విజయం సాధించి సెమీస్‌కు సులభంగా అడుగుపెట్టేశాయి. టీమ్ఇండియా మహిళా క్రికెట్ జట్టు వరుస మ్యాచ్‌ల్లో ఓటమి గ్యాప్‌లో ఉంది. కానీ, ఆ తప్పుల నుంచి సరైన పాఠం నేర్చుకోవడం లేదు. చివరివరకు పోరాటంలో తడబడుతూ, చేతిలో ఉన్న విజయాలను ప్రత్యర్థులకు ఇచ్చేస్తోంది. గత మూడు మ్యాచ్‌ల్లో కూడా ఇదే దృశ్యం. వన్డే ప్రపంచకప్ కీలక దశ చేరుకోవడం దగ్గరగా ఉన్న సమయంలో, హర్మన్‌ప్రీత్ సేన తక్షణమే వ్యూహాలను మార్చాలి. చివరి వార్షికం వరకు గట్టిగా పోరాటం చేస్తేనే జట్టు విజయాల మార్గంలో అడుగులు వేస్తుంది.



# ఘనంగా దీపావళి జరుపుకున్న భారత క్రికెటర్లు

దేశవ్యాప్తంగా దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. భారత క్రికెటర్లు సైతం ఈ దీపావళిని ప్రత్యేకంగా జరుపుకున్నారు. దీపావళి సందర్భంగా క్రికెట్ దిగ్గజాలు తమ అభిమానులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఐసీసీ ఛైర్మన్ జై షా సహా పలువురు ప్రముఖ క్రికెటర్లు ఉన్నారు. అదే సమయంలో ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న విరాట్ కోహ్లీ దీపావళి సందర్భంగా ప్రత్యేక మెస్సేజ్ ఇచ్చారు. భారత వన్డే జట్టు వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, "అందరికీ దీపావళి శుభాకాంక్షలు! అని ఎక్స్ లో పోస్ట్ చేశాడు. మీ జీవితం వెలుగులు, ప్రేమ, అమిత ఆనందంతో నిండి ఉండాలి" అని రాసుకొచ్చాడు..భారత జట్టు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ "వెలుగు, ఆనందం ఉంటే చాలా సానుకూలత. మీ అందరికీ దీపావళి శుభాకాంక్షలు!" అని శుభాకాంక్షలు తెలిపాడు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటిలోనూ వెలుగు ప్రకాశింపజేయాలి, ప్రతి హృదయంలో శాంతి, ఆనందం నివసిస్తుంది అని పోస్ట్ చేశారు. భారత మాజీ క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్ ఇలా పోస్ట్ చేశారు. దీపావళి దివ్య కాంతి మీ జీవితాలను శాంతి, శ్రేయస్సు, ఆనందంతో ప్రకాశింపజేస్తుంది. మీ అందరికీ ప్రకాశవంతమైన, అందమైన దీపావళి శుభాకాంక్షలు అని లక్ష్మణ్ విషెస్ తెలిపారు.



# అడిలైడ్‌లో కోహ్లీ రాణించేనా..?

పునరాగమనంలో డకౌట్‌తో తీవ్రంగా నిరాశపర్చిన విరాట్ కోహ్లీ.. మరో కీలక పోరుకు సిద్ధమయ్యాడు. అచ్చొచ్చిన మైదానంలో ప్రత్యర్థికి చుక్కలు చూపించేందుకు రెడీ అవుతున్నాడు. నాలుగున్నర నెలల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చిన కోహ్లీ.. పెర్త్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్ డకౌటయ్యాడు. దాంతో ఈ మ్యాచ్‌లో టీమిండియా డక్ వర్త్ లూయిస్ పద్ధతిన 7 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. అడిలైడ్ వేదికగా గురువారం రెండో వన్డే జరగనుంది. ఈ సిరీస్‌లో నిలవాలంటే టీమిండియా ఈ మ్యాచ్ గెలవాలి. లేదంటే మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కోల్పోతుంది. అడిలైడ్ వన్డే గెలవాలంటే కోహ్లీతో పాటు రోహిత్ శర్మ రాణించాలి. అయితే అడిలైడ్‌లో కోహ్లీ రికార్డ్స్ బాగున్నాయి. అడిలైడ్ వేదికగా మూడు ఫార్మాట్లలో కలిపి 15 ఇన్నింగ్స్‌లు ఆడిన కోహ్లీ.. 65 సగటుతో 975 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలతో పాటు 4 శతకాలు ఉన్నాయి.ఇక్కడ ఇప్పటి వరకు 4 వన్డేలు ఆడిన కోహ్లీ 61 సగటుతో 244 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. దాంతో కోహ్లీ నుంచి మరో సెంచరీ వస్తుందని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. అడిలైడ్ వేదికగా అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కూడా కోహ్లీ కొనసాగుతున్నాడు. 975 పరుగులతో అతను టాప్ స్కోరర్‌గా నిలవగా.. సర్ డాన్ బ్రాడ్‌మన్ (970), స్టీవ్ స్మిత్(934), గ్రేగ్ చాపెల్(747), షేన్ వాట్సన్ (729), ఆడమ్ గిల్‌క్రిస్ట్ (687) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. ఈ జాబితాలో బ్రాడ్‌మన్ మినహా మిగతా బ్యాటర్లంతా కోహ్లీ కంటే ఎక్కువ ఇన్నింగ్స్ ఆడారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024-25లో భాగంగా అడిలైడ్ వేదికగా చివరిసారిగా ఆడిన కోహ్లీ.. ఈ డే/నైట్ టెస్ట్‌లో తీవ్రంగా నిరాశపర్చాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో 7, 11 పరుగులు మాత్రమే చేశాడు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్న కోహ్లీ, రోహిత్‌లకు ఈ మ్యాచ్ అగ్ని పరీక్షగా మారింది. ఈ మ్యాచ్‌లో రాణిస్తేనే వారిపై ఒత్తిడి తగ్గనుంది. లేదంటే విమర్శలు రెట్టింపు అవుతాయి.

# బ్రాడ్ ఎవాన్స్ టెస్ట్ క్రికెట్‌లో కొత్త రికార్డు

జింబాబ్వే ఆల్ రౌండర్ బ్రాడ్ ఎవాన్స్ టెస్ట్ క్రికెట్‌లో కొత్త రికార్డు సృష్టించాడు. కేవలం 9.3 ఓవర్లలోనే 5 వికెట్లు పడగొట్టాడు. జింబాబ్వే టాస్ గెలిచి ఆఫ్ఘనిస్తాన్‌పై బౌలింగ్ ఎంచుకుంది. దీని ప్రకారం, మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ జట్టు మంచి ఆరంభాన్ని ఇచ్చింది. కానీ 77 పరుగుల వద్ద 2వ వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత ఆఫ్ఘన్ బ్యాట్స్‌మెన్స్ పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఫలితంగా, ఆఫ్ఘనిస్తాన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 127 పరుగులకు ఆలౌట్ అయింది.ఆఫ్ఘనిస్తాన్ జట్టు తక్కువ స్కోరు సాధించడానికి ప్రధాన కారణం బ్రాడ్ ఎవాన్స్. ఈ మ్యాచ్‌లో ఇవాన్స్ 57 బంతులు వేసి కేవలం 22 పరుగులకు 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో పాటు, జింబాబ్వే తరపున ఒక టెస్ట్ మ్యాచ్‌లో అత్యల్పంగా 5 వికెట్లు తీసిన రికార్డును కూడా అతను సృష్టించాడు. గతంలో ఈ రికార్డు జింబాబ్వే మాజీ కెప్టెన్ హీత్ స్ట్రీక్ పేరిట ఉండేది. 2001లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో స్ట్రీక్ 27 పరుగులకు 5 వికెట్లు పడగొట్టాడు. దీనితో, జింబాబ్వే తరపున ఒక టెస్ట్‌లో అతి తక్కువ పరుగులకు ఐదు వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. 24 సంవత్సరాల క్రితం నెలకొల్పిన రికార్డును బ్రాడ్ ఎవాన్స్ ఇప్పుడు బద్దలు కొట్టాడు. ఆఫ్ఘనిస్తాన్‌పై కేవలం 22 పరుగులకు 5 వికెట్లు పడగొట్టి అతను కొత్త చరిత్ర సృష్టించాడు. దీనితో, జింబాబ్వే తరపున అతి తక్కువ పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసిన బౌలర్‌గా బ్రాడ్ ఎవాన్స్ నిలిచాడు.



# పుకార్లకు ఫుల్‌స్టాప్..

## నిర్మాతపై 'ఓజీ' దర్శకుడి ప్రశంసల వర్షం





'ఓజీ' చిత్ర దర్శకుడు సుజీత్, నిర్మాత డీవీవీ దానయ్య మధ్య విభేదాలు తలెత్తాయంటూ గత కొంతకాలంగా ఇండస్ట్రీ వర్గాల్లో జరుగుతున్న ప్రచారానికి సుజీత్ తన సోషల్ మీడియా పోస్టుతో ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు. తమ మధ్య ఎలాంటి పొరపొచ్చాలు లేవని చెబుతూ, నిర్మాత దానయ్యకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది."ఓజీ సినిమా గురించి బయట చాలామంది రకరకాలుగా మాట్లాడుకుంటారు. కానీ ఒక ప్రాజెక్ట్‌ను ప్రారంభం నుంచి ముగింపు వరకు నడిపించడానికి ఏం అవసరమో కొందరికి మాత్రమే అర్థమవుతుంది. ఆ విషయంలో నన్ను నమ్మి, నాకు అండగా నిలిచిన నా నిర్మాత దానయ్య గారికి, నా టీమ్‌కు మాటల్లో చెప్పలేనంతగా రుణపడి ఉంటాను" అని సుజీత్ తన పోస్టులో పేర్కొన్నారు. అయితే, సుజీత్ ఉన్నట్టుండి ఈ పోస్ట్ పెట్టడం వెనుక బలమైన కారణం ఉందనే చర్చ జరుగుతోంది. వాస్తవానికి, సుజీత్ తన తదుపరి చిత్రాన్ని హీరో నానితో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపైనే చేయనున్నట్లు గతంలో ప్రకటించారు. కానీ, కొద్ది రోజుల క్రితం ఈ ప్రాజెక్ట్ నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై లాంఛనంగా ప్రారంభమైంది. ఈ అనూహ్య మార్పుతోనే సుజీత్‌కు, దానయ్యకు మధ్య దూరం పెరిగిందని, అందుకే నిర్మాణ సంస్థ మారిందనే పుకార్లు షికారు చేశాయి. ఈ రూమర్లకు బలం చేకూర్చేలా 'ఓజీ' నిర్మాణ సమయంలోనూ ఇద్దరి మధ్య అభిప్రాయభేదాలు వచ్చాయని వార్తలు వినిపించాయి. ఈ ఊహాగానాల నేపథ్యంలోనే, తన నిర్మాతతో ఎలాంటి సమస్యలు లేవని స్పష్టం చేసేందుకే సుజీత్ ఈ పోస్ట్ పెట్టారని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా, బాక్సాఫీసు వద్ద ఘన విజయం సాధించిన 'ఓజీ' సినిమా ఈ నెల 23 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

# కళ్యాణ్ రామ్ సర్‌ప్రైజింగ్ లుక్ అదుర్స్



నందమూరి కళ్యాణ్ రామ్ ఈ ఏడాది 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. విజయశాంతిని ఆ సినిమాలో నటింపజేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించాడు. కమర్షియల్‌గా కళ్యాణ్ రామ్ విజయాన్ని సొంతం చేసుకోలేక పోయినా నటుడిగా ప్రతి సినిమాకు మంచి పేరును సొంతం చేసుకుంటున్న విషయం తెల్సిందే. ప్రస్తుతం నందమూరి కళ్యాణ్ రామ్ మంచి కథల కోసం వెయిట్ చేస్తున్నాడు. ఇప్పటికే ఆయన వద్ద ఒకటి రెండు కథలు ఫైనల్ చేసి ఉన్నాయని, వాటిని త్వరలోనే పట్టాలెక్కించేందుకు రెడీ అవుతున్నాడని సమాచారం అందుతోంది. ఆకట్టుకునే విధంగా నందమూరి కళ్యాణ్ రామ్ ఈసారి సినిమాతో రావాలని ఆశ పడుతున్నాడు. అందుకే కాస్త ఆలస్యం అయినా పర్వాలేదు అని ఈ నందమూరి హీరో వెయిట్ అండ్ సీ అన్నట్లుగా తన సినిమాను లేట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నందమూరి కళ్యాణ్ రామ్ లుక్... ఈ గ్యాప్‌లో నందమూరి కళ్యాణ్ రామ్ కథలు వినడంతో పాటు ఫిజిక్ విషయంలో దృష్టి పెట్టినట్లుగా ఉన్నాడు. అందుకే తాజాగా ఆయన లుక్ ను చూసి చాలా మంది సర్‌ప్రైజ్ అవుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా గ్రీక్ గాడ్ లుక్‌లో కళ్యాణ్ రామ్ కండలు తిరిగిన బాడీతో వావ్ అనిపిస్తున్నాడు. వయసు పెరుగుతున్నా కొద్ది కళ్యాణ్ రామ్ మరింత హ్యాండ్సమ్‌గా కనిపిస్తున్నాడు అంటే లేడీ ఫ్యాన్స్ సైతం కామెంట్స్ చేస్తున్నారంటే ఏ స్థాయిలో ఆయన లుక్ ఉందో అర్థం చేసుకోవచ్చు. కళ్యాణ్ రామ్ తాజా మేకోవర్, ఫిజిక్ ను చూస్తూ ఉంటే వచ్చే సినిమాలో ఖచ్చితంగా మంచి సాలిడ్ కంటెంట్‌తో, సాలిడ్ లుక్‌తో కనిపించే అవకాశాలు ఉన్నాయని అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# మళ్లీ అవకాశాలు అంగీకరిస్తున్నా

## -రేణూదేశాయ్ వెల్లడి



ఒకప్పుడు కథానాయికగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన రేణూ దేశాయ్ దాదాపు 20 ఏళ్ల తర్వాత రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు'లో కనిపించిన సంగతి తెలిసిందే. సంఘ సంస్కర్త హేమలతా లవణం పాత్రని పోషించారు. అయితే, ఆ సినిమా సమయంలో తనపై కొన్ని విమర్శలు వచ్చాయని తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ ట్రోల్ చేసినవారు ఎవరూ తర్వాత తనకు క్షమాపణలు చెప్పలేదన్నారు. 'నేను 'టైగర్ నాగేశ్వరరావు' చేసిన సమయంలో నాపై విమర్శలు వచ్చాయి. కమ్‌బ్యాక్ ఇచ్చింది.. ఇక ఎక్కడ చూసినా కనిపిస్తుంది. ఎలాంటి సినిమాల్లోనైనా నటిస్తుందని రాశారు. ఇప్పుడు ఆ సినిమా వచ్చి రెండేళ్లు అవుతోంది. ఇప్పటివరకూ నేను మళ్లీ స్క్రీన్‌పై కనిపించలేదు. ఏ సినిమాకు సైన్ చేయలేదు. నేను సినిమాలు అంగీకరించలేదని నా గురించి అలా మాట్లాడిన వాళ్లు ఇప్పుడు వచ్చి క్షమాపణలు చెప్పరు. మాట్లాడేవారు ఎలాగైనా మాట్లాడతారంతే. నాకు నటన అంటే చాలా ఇష్టం. కానీ, అదే నా లక్ష్యం కాదు. 15 ఏళ్ల వయసులోనే ఇండస్ట్రీకి వచ్చాను. నేను డబ్బుకు ప్రాధాన్యం ఇచ్చే మనిషిలా కనిపిస్తాను. డబ్బును జాగ్రత్తగా ఖర్చు చేస్తాను.. కానీ, దానికి ప్రాధాన్యం ఇవ్వను. ఒకవేళ నేను అప్పటినుంచి ఇప్పటి వరకూ సినిమాలు చేస్తూ ఉన్నట్లైతే ఇప్పటికి చాలా మంచి పేరు వచ్చేదని రేణు చెప్పారు. తనకు ఇప్పుడు గొప్ప పాత్రలు వస్తున్నాయన్నారు. మహిళా ప్రాధాన్యం ఉన్న చిత్రాల్లో ఛాన్స్‌లు వస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అత్తగారి పాత్రకు ఓకే చేసినట్లు చెప్పారు. త్వరలోనే ఆ సినిమా ప్రారంభం కానుందన్నారు. అత్తాకోడళ్లకు సంబంధించిన కామెడీ చిత్రంగా అది రానున్నట్లు వెల్లడించారు. తనకు ఆధ్యాత్మిక మార్గం అంటే ఇష్టమని.. భవిష్యత్తులో సన్యాసం తీసుకునే అవకాశం ఉందని రేణూ దేశాయ్ చెప్పారు.

# నవీన్ పోలిశెట్టి... అనగనగా ఒక రాజు




జాతిరత్నాలు తరువాత మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సినిమాతో వచ్చాడు. ఇక ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఇక దాని తరువాత నవీన్ నటిస్తున్న చిత్రం అనగనగా ఒక రాజు. కొన్ని కారణాల వలన ఆగుతూ వచ్చింది. మారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నాడు. మొదట ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తుంది అని చెప్పారు. ఆ తరువాత ఆమె ప్లేస్ ను మీనాక్షీ చౌదరి రీప్లేస్ చేసింది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, వీడియోలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక నవీన్ తన సినిమాకు ఏ రేంజ్ లో ప్రమోషన్స్ చేస్తుందో అన్న విషయం అందరికీ తెల్సిందే. ముఖ్యంగా అనగనగా ఒక రాజు సినిమా ప్రమోషన్స్ భాద్యత మొత్తం నవీన్ తన భుజాల మీద వేసుకున్నాడు. ప్రతి పండగకు అందరూ తమ సినిమావైపు తిరిగి చూసేలా ప్రమోషన్స్ చేస్తాడు. మొన్న దసరాకు ప్లలెటూరు వెళ్ళి అక్కడున్నవారితో సినిమా గురించి మాట్లాడి దసరా శుభాకాంక్షలు చెప్పించాడు. ఇప్పుడు దీపావళీకి కూడా మరో కొత్త కాన్సెప్ట్ తో వచ్చేశాడు. దీపావళీ టపాకాయలు అమ్ముతూ తన సినిమా గురించి చెప్పుకొచ్చాడు. అనగనగా ఒక రాజు ఫుల్ ఎంటర్ టైన్మెంట్. దీపావళీ నుంచి సంక్రాంతి వరకు ఇది పేలుతూనే ఉంటుందని చెప్పుకొచ్చాడు. అంతేకాకుండా అనగనగా ఒక రాజు నుంచి మొదటి సాంగ్ ను త్వరలోనే రిలీజ్ కానుందని మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. ఇక ఈ ప్రమోషన్స్ చూసి .. నిజంగా నవీన్ జాతిరత్నం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 14 న ఈ సినిమా ప్రేక్షకుల ముందకు రానుంది. మరి ఈ సినిమాతో రాజుగారు ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# బాలీవుడ్ సీనియర్ నటుడు అస్రానీ కన్నుమూత



బాలీవుడ్ సీనియర్ నటుడు, దర్శకుడు గోవర్ధన్ అస్రాని కన్నుమూశారు. ఆయన వయసు 84 సంవత్సరాలు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అస్రానిని నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన నిన్న సాయంత్రం తుదిశ్వాస విడిచారు. అస్రాని మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, సహచరులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1941లో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జన్మించిన అస్రాని.. ప్రారంభంలో ఆల్ ఇండియా రేడియోలో వాయిస్ ఆర్టిస్ట్‌గా పనిచేశారు. అదే సమయంలో తన విద్యను పూర్తి చేశారు. నటనపై ఉన్న ఆసక్తితో 1962లో ముంబయికి వెళ్లారు. అక్కడ దర్శకులు కిశోర్ సాహు, హృషికేశ్ ముఖర్జీ సలహా మేరకు పుణెలోని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. 1966లో విడుదలైన "హమ్ కహా జా రహే హై" సినిమాతో వెండితెరపై తొలి అడుగుపెట్టిన ఆయన, 1967లో వచ్చిన "హరే కాంచ్ కీ చూడియా"తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, "షోలే" సినిమాలో ఆయన పోషించిన జైలర్ పాత్ర ఆయనకు విశేషమైన పేరు తెచ్చిపెట్టింది. సుదీర్ఘ సినీ ప్రస్థానంలో అస్రాని 350కిపైగా సినిమాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. "హీరో హిందూస్థానీ", "డ్రీమ్ గర్ల్ 2" వంటి చిత్రాల్లో కూడా ఆయన గుర్తుండిపోయే పాత్రలు పోషించారు. అంతేకాకుండా "చలా మురారీ హీరో బన్నే", "ఉడాన్" వంటి సినిమాలకు దర్శకత్వం వహించి తన ప్రతిభను చాటుకున్నారు. బాలీవుడ్‌లో చిరునవ్వుల నటుడిగా పేరుగాంచిన అస్రాని మరణం సినీ ప్రపంచానికి పూడ్చలేని లోటు అని అభిమానులు చెబుతున్నారు.

# అమ్మాయిల తరపున వకాల్తా పుచ్చుకున్న రష్మిక..!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న 'థామా' సినిమాతో నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆయుష్మాన్ ఖురాన హీరోగా నటించిన ఈ హర్రర్ థ్రిల్లర్ మూవీపై అంచనాలు పెరిగే విధంగా రష్మిక మందన్న గత రెండు వారాలుగా ప్రచారం చేసిన విషయం తెల్సిందే. ఇదే సమయంలో రష్మిక తన రాబోయే సినిమాల గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. కానీ థామా సినిమా ప్రమోషన్ సమయంలో అయినా రష్మిక తన వివాహ నిశ్చితార్థం గురించి ఓపెన్ అవుతుందని అంతా భావించారు. కానీ రష్మిక ఆ ప్రశ్నలు రాకుండానే చాలా జాగ్రత్త పడింది. మీడియా సమావేశంలో ఆ విషయాల గురించి ప్రస్తావించిన సమయంలో మౌనంగా నవ్వుతూ ఉండి పోయింది. దాంతో రష్మిక మందన్న, విజయ్ దేవరకొండల యొక్క వివాహ నిశ్చితార్థం గురించి ఇంకా క్లారిటీ రాలేదు అని అభిమానులతో పాటు అంతా ఆవేదన వ్యక్తం చేస్తూనే ఉన్న విషయం తెల్సిందే. రష్మిక మందన్న థామా సినిమా రిలీజ్ తాజాగా రష్మిక మందన్న ఒక చిట్ చాట్‌లో ప్రేమ విఫలం, ఆ సమయంలో ఇద్దరూ పడే బాధ గురించి మాట్లాడింది. చాలా మంది లవ్ బ్రేకప్ సమయంలో ఎక్కువగా అబ్బాయిలు బాధ పడుతారు, వారే చాలా కాలం పాటు అందులో నుంచి బయటకు రాలేక పోతారు, ఆత్మహత్యలు చేసుకుంటారు, దారుణాలకు వడిగడుతారు అంటూ ప్రచారం ఉంది. పలు సర్వేల్లోనూ అదే విషయం వెల్లడి అయింది. కానీ రష్మిక మాత్రం అందుకు విరుద్ధంగా చెప్పుకొచ్చింది. ప్రేమ విఫలం అయిన సమయంలో అబ్బాయిలు మాత్రమే బాధ పడుతారు అంటూ ఉన్న ప్రచారంను ఆమె కొట్టి పారేసింది. అబ్బాయిలు ఎక్కువగా బాధ పడుతారు అంటే తాను ఒప్పుకోను అంది. అబ్బాయిలకు ఏమాత్రం తగ్గకుండా, వారి రిలేషన్‌షిప్ విషయంలో అమ్మాయిలు కూడా చాలా సీరియస్‌గా ఉంటారని రష్మిక మందన్న తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. లవ్ ఫెయిల్యూర్‌పై రష్మిక మందన్న ఇంకా రష్మిక మందన్న మాట్లాడుతూ... అమ్మాయిలు బాధను వ్యక్తపరిచేందుకు మార్గాలు లేవు అన్నట్లుగా చెప్పుకొచ్చింది. అబ్బాయిలు ప్రేమ విఫలం అయిందంటే గడ్డాలు పెంచుకోవడం, మందు తాగడం చేస్తారు. కానీ అమ్మాయిలు అలా చేయలేరు. పెంచుకోవడానికి గడ్డం ఉండదు, అలాగే మందు తాగి తమ ప్రేమ విఫలం గురించి బయట పడరు అంది. అమ్మాయిలకు తమ ఆవేదన వ్యక్తం చేసుకునేందుకు ఎక్కువ మార్గాలు లేకపోవడం వల్లే అబ్బాయిలకు ఈ విషయంలో ఎక్కువగా సానుభూతి లభిస్తుంది అంటూ రష్మిక మందన్న ఈ విషయంలో అమ్మాయిల తరపున వకాల్తా పుచ్చుకుని మాట్లాడింది.

